


# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com






హైదరాబాద్ | బుధవారం 21-4-2021 | RNI No.52865/93·Postal No\.H/SD/258/2020-2022 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :27 | సంచిక: 216 | పేజీలు: 4 | వెల: రూ.1/-


## ప్రధాని మోడీ విదేశీ పర్యటనలపై కరోనా నీలిమేఘాలు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 20:: భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విదేశీ పర్యటనలపై కరోనా నీలిమేఘాలు కమ్ముకున్నాయి. వచ్చే నెలలో జరుపతలపెట్టిన పోర్చుగల్, ఫ్రాన్స్ పర్యటనలు రద్దు చేసుకునే అవకాశాలు ఉన్నాయి. ఈయూ శిఖరాగ్ర సమావేశం వర్చువల్ జరిపేందుకు కసరత్తులు జరుగుతున్నాయి.

భారతదేశంలో కరోనా సెకండ్ వేవ్ ప్రమాదకరంగా మారుతున్నది. ఇది ప్రధాని మోదీ విదేశీ పర్యటనలపై కూడా ప్రభావం చూపుతున్నది. వచ్చే నెలలో మోదీ ఫ్రాన్స్, పోర్చుగల్ పర్యటన ఇబ్బందుల్లో పడే అవకాశాలు కనిపిస్తున్నాయి. భారతదేశంలో ప్రతిరోజూ రెండున్నర మిలియన్లకు పైగా కరోనా కేసులు నమోదవుతున్నాయి. ఈ కారణంగా భారతదేశం నుంచి వచ్చే ప్రయాణికులను వివిధ దేశాలు నిషేధిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ప్రధానమంత్రి విదేశీ పర్యటనపై తుది నిర్ణయం ఇంకా తీసుకోలేదని తెలుస్తున్నది.

ప్రధాని పర్యటన గురించి విదేశాంగ మంత్రిత్వ శాఖ అధికారికంగా ప్రకటించనప్పటికీ సన్నాహాలు మాత్రం జరుగుతున్నాయి. ఇటువంటి పరిస్థితిలో వర్చువల్‌గా నిర్వహించే ఈయూ సదస్సులో మాత్రమే మోదీ పాల్గొనే అవకాశాలున్నాయి.

ఇప్పటికే షెడ్యూల్ చేసిన వివరాల ప్రకారం.. వచ్చే నెల 8 న ప్రధాని మోదీ పోర్చుగల్ పర్యటన చేపట్టి అక్కడి నుంచి ద్వైపాక్షిక చర్చల కోసం ఫ్రాన్స్ కూడా వెళ్తారు. అక్కడ ఫ్రెంచ్ అధ్యక్షుడితో భేటీ కానున్నారు. జూన్‌లో జీ 7 శిఖరాగ్ర సమావేశం సమయానికి పరిస్థితులు మెరుగుపడితేనే ప్రధాని మోదీ బ్రిటన్‌ను సందర్శించవచ్చు. జీ 7 లో బ్రిటన్, కెనడా, ఫ్రాన్స్, జర్మనీ, ఇటలీ, జపాన్, అమెరికా, యూరోపియన్ యూనియన్ ఉన్నాయి.

ఇలాఉండగా, భారతదేశంలో కరోనా ఇన్‌ఫెక్షన్ పెరుగుతున్న నేపథ్యంలో బ్రిటిష్ ప్రధాని బోరిస్ జాన్సన్ భారత పర్యటన వాయిదా పడింది. ఇప్పుడు అతను కొన్ని రోజుల తరువాత భారతదేశానికి రావాలని ప్లాన్ చేసుకుంటున్నట్లు సమాచారం. ఇప్పటికే బోరిస్ జాన్సన్ ఒకసారి భారత పర్యటన రద్దైంది.

## తెలంగాణలో నైట్ కర్ఫ్యూ..

హైదరాబాద్, ఏప్రిల్ 20: కరోనా కేసుల తీవ్రత దృష్ట్యా తెలంగాణ ప్రభుత్వ నైట్ కర్ఫ్యూను విధించిన విషయం విదితమే. ఈ కర్ఫ్యూ నుంచి అత్యవసర సేవలతో పాటు మీడియా, పెట్రోల్ బంక్‌లకు మినహాయింపు ఇచ్చారు. నీటి సరఫరా, పారిశుద్ధ్యం పనులకు రాత్రి కర్ఫ్యూ నుంచి మినహాయింపు ఇచ్చారు.

### మినహాయింపు

అత్యవసర సేవలు, పెట్రోల్ బంకులు, మెడికల్ షాపులు, డయాగ్నోస్టిక్ సెంటర్లు, ఆస్పత్రులు, ప్రయివేటు సెక్యూరిటీ సర్వీసులు, ఈ-కామర్స్ సేవలు, ఆహార పదార్థాల పంపిణీ, కోల్డ్ స్టోరేజ్‌లు, గోడౌన్లకు మినహాయింపు ఇచ్చారు.

విమాన, రైలు, బస్సు ప్రయాణికులకు వ్యాలిడ్ టికెట్లు ఉంటే కర్ఫ్యూ నుంచి మినహాయింపు ఇవ్వనున్నారు. వైద్యం కోసం వెళ్లే గర్భిణులు, రోగులకు కూడా మినహాయింపు ఇచ్చారు. అంతరాష్ట్ర రవాణాకు ఎలాంటి పాసులు అవసరం లేదని ప్రభుత్వం స్పష్టం చేసింది.

పౌరులు బయట తిరగడం, థియేటర్లు, పబ్బులు, క్లబ్బులు, బార్లు, రెస్టారెంట్లు, మద్యం దుకాణాలు, హోటల్స్ రాత్రి 8 గంటల తర్వాత బంద్ కానున్నాయి.

## కరోనా రోగులకు ఆక్సిజన్ కొరత లేదు : మంత్రి ఈటల



నల్లగొండ, ఏప్రిల్ 20:: సూర్యాపేటలో మాతా శిశు సంరక్షణ కేంద్రాన్ని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి ఈటల రాజేందర్, విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్ రెడ్డి కలిసి ప్రారంభించారు. రూ. 17 కోట్లతో 250 పడకలతో మాతాశిశు సంరక్షణ కేంద్రాన్ని నిర్మించారు.

ఈ సందర్భంగా మంత్రి ఈటల రాజేందర్ మాట్లాడుతూ.. కొవిడ్ చికిత్సకు ప్రభుత్వం పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. కరోనా రోగులకు రాష్ట్రంలో ఆక్సిజన్ కొరత లేదని తేల్చిచెప్పారు. ఆస్పత్రుల్లో పడకలు దొరకడం లేదన్న పుకార్లు నమ్మొద్దు అని విజ్ఞప్తి చేశారు. ప్రజలు భయభ్రాంతులకు గురి కావొద్దు అని సూచించారు. కొవిడ్ రోగుల్లో 5 శాతం మందిలోనే అనారోగ్య సమస్యలు వస్తున్నాయని తెలిపారు. 99.5 శాతం మంది రికవరీ అవుతున్నారని పేర్కొన్నారు. ప్రతి ఆరోగ్య కేంద్రంలో కొవిడ్ టెస్టు పరికరాలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. ఇతర రాష్ట్రాలతో పోలిస్తే కొవిడ్ రోగులకు తెలంగాణ మెరుగైన సేవలందిస్తోంది అని ఈటల రాజేందర్ స్పష్టం చేశారు.

## నిరాడంబరంగా మంత్రి కొప్పుల జన్మదిన వేడుకలు



హైదరాబాద్, ఏప్రిల్ 20: షెడ్యూల్డ్ కులాల అభివృద్ధిశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ తన జన్మదిన వేడుకలను నిరాడంబరంగా జరుపుకున్నారు.

కొవిడ్ కారణంగా వేడుకలకు ఆయన దూరంగా ఉన్నారు. కుటుంబ సభ్యులతో కలిసి ఉదయం అమీర్‌పేటలోని దుర్గామాత ఆలయానికి వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు.

సీఎం కేసీఆర్ కరోనా బారి నుంచి త్వరగా కోలుకోవాలని అమ్మవారిని వేడుకున్నట్లు తెలిపారు. అనంతరం కుటుంబ సభ్యులతో కలిసి మొక్కలు నాటారు.

పలువురు ప్రజాప్రతినిధులు, ప్రముఖులు, టీఆర్ఎస్ శ్రేణులు, అభిమానులు ఆయన శుభాకాంక్షలు తెలిపారు.

మంత్రి కొప్పులకు శుభాకాంక్షలు తెలిపిన వారిలో మంత్రులు కేటీఆర్, ఈటల రాజేందర్, గంగుల కమలాకర్, ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు బీ వినోద్ కుమార్, ప్రభుత్వ విప్ బాల్క సుమన్, ఎంపీలు జోగినపల్లి సంతోష్ కుమార్, బోర్లకుంట వెంకటేశ్ నేతకాని, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత, ఎమ్మెల్యేలు కే విద్యాసాగర్ రావు, డాక్టర్ సంజయ్ కుమార్, దేవిరెడ్డి సుధీర్ రెడ్డి, కోరుకంటి చందర్, సుంకె రవిశంకర్, హరిప్రియా నాయక్, దివ్యాంగుల ఆర్థిక సహకార సంస్థ చైర్మన్ వాసుదేవరెడ్డి తదితరులున్నారు.

## కరోనా ఎఫెక్ట్ : ఆక్సిజన్ కోసం రెండు రాష్ట్రాల తగువులాట..!

భోపాల్, ఏప్రిల్ 20:: కరోనా వైరస్ సెకండ్ వేవ్ ఉధృతమవుతుండటంతో ఆక్సిజన్ కోసం రాష్ట్రాలు తగువులాడుకోవాల్సి వస్తున్నది. తాజాగా ఒక రాష్ట్రానికి చెందిన ఆక్సిజన్ ట్యాంకర్‌ను పొరుగు రాష్ట్రం అధికారులు నిలిపివేయడంతో సమస్య ఇబ్బందికరంగా తయారైంది. దాంతో ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రులు రంగంలోకి దిగి సమస్యను పరిష్కరించాల్సి వచ్చింది. ఆపత్కాలంలో ఆదుకునే ఆక్సిజన్‌ను అడ్డుకోవడం నేరం అని తెలిసినప్పటికీ ఉన్నతాధికారులు అడ్డుకోవడం తీవ్ర విమర్శలకు తావిస్తోంది. కరోనా సెకండ్ వేవ్‌లో రోగుల సంఖ్య భారీగా పెరుగడంతో ఆక్సిజన్ అవసరం చాలా ఎక్కువైంది. రాష్ట్రంలో ఆక్సిజన్ లేకపోవడం వల్ల రోగులు మరణిస్తున్న కేసులు ఒకవైపు పెరుగుతున్నాయి. ఇదిలా ఉండగా, మధ్యప్రదేశ్‌కు చెందిన ఆక్సిజన్ ట్యాంకర్లను ఇతర రాష్ట్రాల్లో నిలిపివేయడంతో సమస్య తీవ్రరూపం దాల్చింది. ఝాన్సీ, మోదీనగర్ వస్తున్న ఆక్సిజన్ ట్యాంకర్లను అధికారులు నిలిపేశారు.

## జబర్దస్త్ లో కరోనా కలకలం..ఇంకా ఎంత మందికి వచ్చింది..?

హైదరాబాద్, ఏప్రిల్ 20:తెలుగు బుల్లితెరపై ఎవర్ గ్రీన్ కామెడీ షో జబర్దస్త్. అయితే కేవలం కామెడీతో మాత్రమే కాకుండా కాంట్రవర్సీతో కూడా అప్పుడప్పుడు వార్తల్లో ఉంటుంది జబర్దస్త్ కామెడీ షో. ఇక ఇప్పుడు కరోనాతో వార్తల్లోకి వచ్చింది ఈ షో. ఇదివరకే ఇందులో కొంతమందికి కరోనా పాజిటివ్ వచ్చింది. అయితే ఆ విషయం బయటకు రాకుండా చూసుకున్నారు. అప్పట్లో సుడిగాలి సుధీర్ కు కూడా కరోనా వచ్చిందని వార్తలు వచ్చాయి. షూటింగుకు అనుమతులు వచ్చిన తర్వాత అన్ని జాగ్రత్తలు తీసుకొని జబర్దస్త్ షూట్ చేస్తున్నారు. అయినా కూడా ఈ వైరస్ వాళ్లను వదిలిపెట్టడం లేదు.

తాజాగా వర్ష కరోనా బారిన పడింది. కేవలం ఆమెకు మాత్రమే పాజిటివ్ వచ్చిందా.. ఇంకా కొంతమందికి కూడా అలాగే వచ్చిందా అనేది అర్థం కావడం లేదు. కేవలం వర్ష విషయం మాత్రమే బయటికి వచ్చింది. అయితే ఈమెకు రావడంతో పాటు మరి కొందరు కమెడియన్లు కూడా కోవిడ్ బారిన పడ్డట్లు తెలుస్తుంది. ముఖ్యంగా వర్షతో పాటు ఉండే మరో కమెడియన్ ఇమాన్యుయేల్ కూడా వైరస్ బారిన పడినట్టు వార్తలు వస్తున్నాయి. వీళ్లు మాత్రమే కాదు అతని టీం లీడర్ కెవ్వు కార్తిక్ కూడా ప్రస్తుతం హోమ్ క్వారంటైన్ లో ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. జబర్దస్త్ లో చాలామంది కమెడియన్లు ప్రస్తుతం ఐసోలేషన్ లో ఉన్నారు. అక్కడ ఒక్కరికి వచ్చినా కూడా అందరికీ ఆ భయం అనేది పోదు. ఇప్పుడు కూడా ఇదే జరుగుతుంది. కేవలం వర్ష వరకు కరోనా వచ్చి వెళ్ళదు కదా.. ఆమెతో పాటు ఉన్న వాళ్లు కూడా కచ్చితంగా క్వారంటైన్ కి వెళ్లాల్సిందే. అందరూ కలిసి షూటింగ్ చేశారు కాబట్టి ఇప్పుడు అందరినీ ఆ భయం వెంటాడుతుంది. ఎప్పుడూ 4 ఎపిసోడ్లు అడ్వాన్స్ షూటింగ్ చేస్తారు కాబట్టి ఇప్పట్లో ఈ కామెడీ షోకి ఎలాంటి ఇబ్బంది లేకపోవచ్చు. కానీ ఇలాంటి పరిస్థితుల్లో షూటింగ్ చేస్తే మాత్రం కచ్చితంగా భవిష్యత్తులో మరిన్ని తిప్పలు తప్పకపోవచ్చు అంటున్నారు విశ్లేషకులు.

## గంటకు 10 వేల కేసులు.. 60 మరణాలు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 20:: దేశంలో కరోనా కల్లోలం ఏ స్థాయిలో ఉందో చెప్పడానికి ఈ గణాంకాలే నిదర్శనం. సెకండ్ వేవ్‌లో భాగంగా గత ఆదివారం నుంచి దేశంలో గంటకు 10 వేల కేసులు, 60 మరణాలు నమోదవుతున్నట్లు కేంద్ర ఆరోగ్య శాఖ విడుదల చేసిన వివరాల ప్రకారం స్పష్టమవుతోంది. ఈ నెల 1న సగటున గంటకు 3,013 కేసులు, 19 మరణాలు నమోదవగా.. ఆ రోజు మొత్తం 72,330 కేసులు, 459 మరణాలు నమోదయ్యాయి.

ఇది కాస్తా ఆదివారానికి (ఏప్రిల్ 18) సగటున గంటకు 10,895 కేసులు, 62 మరణాలకు చేరడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. ఆ రోజు దేశవ్యాప్తంగా 2,61,500 కేసులు, 1501 మరణాలు నమోదైనట్లు ఆరోగ్య శాఖ గణాంకాలు చెబుతున్నాయి. ఇక సోమవారం కేసుల సంఖ్య 2,73,810కి చేరగా.. మరణాలు 1619కి చేరింది. సోమవారానికి సగటున గంటకు 11,408 కేసులు, 67 మరణాలు నమోదయ్యాయి.ఇక వీటిలో మహారాష్ట్రనే టాప్‌లో ఉంది. ఆ రాష్ట్రంలో తాజా సగటు చూసుకుంటే గంటకు 2,859 కేసులు, 20 మరణాలు నమోదవుతున్నాయి. ఆరోగ్యశాఖ ప్రకారం మొత్తం కేసుల్లో 10 రాష్ట్రాల వాటానే 82.74 శాతంగా ఉంది. రోజువారీ మరణాల్లో 351తో మహారాష్ట్ర తొలి స్థానంలో, ఢిల్లీ (240) రెండోస్థానంలో ఉన్నాయి.రోజువారీ కేసుల్లో మహారాష్ట్ర తర్వాత ఉత్తరప్రదేశ్ రెండో స్థానంలో ఉంది. యూపీలో తాజాగా గంటకు 1274 కేసులు, 5 మరణాలు నమోదవుతున్నాయి. అటు ఢిల్లీలో గంటకు వెయ్యి కేసులు, 10 మరణాలు సంభవిస్తున్నాయి.

## కరోనా నియంత్రణకు సైన్యం సహకరించాలి :

న్యూఢిల్లీ, ఏప్రిల్ 20:: దేశంలో కరోనా వైరస్ కేసులు భారీగా పెరుగుతున్న వేళ మహమ్మారిని ఎదుర్కొనేందుకు రాష్ట్ర పరిపాలనకు సహాయం అందించాలని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ సైన్యానికి సూచించారు. సైనిక ఆసుపత్రులు అందుబాటులో ఉన్న ప్రాంతాల్లో కొవిడ్? రోగులకు చికిత్స అందించాలన్నారు. ఈ మేరకు ఆర్మీ చీఫ్ ఎంఎం నరవనేతో రక్షణ మంత్రి చర్చించారు. కరోనా బాధితులు ఎక్కువగా ఉన్న రాష్ట్రాల్లో పరిస్థితుల ఆధారంగా ఆర్మీకి చెందిన సీనియర్ అధికారి ముఖ్యమంత్రిని సంప్రదించి అవసరమైన సహకారం అందించాలని చెప్పినట్లు రక్షణ వర్గాలు తెలిపాయి. కరోనా నియంత్రణకు తమ వంతు సాయం సహాయం అందించేందుకు ఎలా సహాయపడుతుందనే విషయంపై రక్షణ మంత్రిత్వశాఖ శాఖ త్రివిధ దళాలతో సంప్రదింపులు జరిపినట్లు పేర్కొన్నాయి.పరిస్థితిని ఎదుర్కోవడంలో తమ సంసిద్ధతను తెలుసుకోవడానికి భారత వైమానిక దళం, నేవీ నాయకత్వానికి సైతం తెలియజేసినట్లు ఆ వర్గాలు చెప్పాయి. విదేశాంగ, రక్షణ కార్యదర్శి అజయ్ కుమార్ పౌర అధికారులకు సాయుధ దళాలు సహాయం అందించే ప్రాంతాలపై సమీక్షించారు. ఇప్పటికే డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ (డీఆర్‌డీఓ) దేశవ్యాప్తంగా పౌర పరిపాలనకు సహకరించాలని ఆదేశాలు ఇవ్వగా.. ఢిల్లీలోని విమానాశ్రయం సమీపంలో వైద్య సదుపాయాలను ఏర్పాటు చేసింది. 250 పడకలతో పని చేయగా.. వాటి సంఖ్యను వెయ్యికి పెంచనున్నారు. లక్నోలో సైతం ఇదే తరహా సదుపాయాలు డీఆర్‌డీఓ కల్పించింది.

## ఆక్సిజన్ కొరత లేదు: ఇండియాలోనే అతిపెద్ద ఆక్సిజన్ తయారీదారు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 20:: కరోనా కేసులు పెరిగిపోతున్న నేపథ్యంలో చాలా రాష్ట్రాలు ఆక్సిజన్ కొరత ఉన్నదని ఫిర్యాదులు చేస్తున్నాయి. అయితే ఇండియాలో అతిపెద్ద ఆక్సిజన్ తయారీదారు ఐనాక్స్ ఎయిర్ ప్రోడక్ట్స్ మాత్రం అలాంటిదేమీ లేదని చెబుతోంది. దేశంలోని మెడికల్ ఆక్సిజన్ మార్కెట్‌లో 50 శాతం ఈ సంస్థే తయారు చేస్తుంది. అయితే ప్రస్తుతం దేశానికి అవసరమైనంత ఆక్సిజన్ ఉత్పత్తి అవుతోందని ఐనాక్స్ ఎయిర్ ప్రోడక్ట్స్ డైరెక్టర్ సిద్ధార్థ్ జైన్ చెప్పారు.

అయితే మహారాష్ట్ర, గుజరాత్‌లలో కొవిడ్ కేసులు తగ్గకపోతేనే ఆందోళన చెందాల్సిన అవసరమున్నదని ఆయన అన్నారు. నిజానికి ఒడిశా, జార్ఖండ్‌లాంటి తూర్పు భారత రాష్ట్రాల్లో అవసరానికి మించిన సరఫరా ఉంది. అయితే డిమాండ్ మాత్రం మహారాష్ట్ర, గుజరాత్, మధ్యప్రదేశ్‌లాంటి పశ్చిమ భారత రాష్ట్రాల నుంచి వస్తోంది. ఇదే అసలు సమస్య అని జైన్ అన్నారు.

డిమాండ్ ఉన్న చోటుకు సరఫరా ఉన్న చోటు చాలా దూరంగా ఉండటం వల్లే ఈ కొరత ఏర్పడుతోందని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ సమస్యను అధిగమించడానికి ప్రయత్నిస్తున్నాం. అందుకే ఇండియన్ రైల్వేస్ ప్రత్యేకంగా ఆక్సిజన్ ఎక్స్‌ప్రెస్ పేరుతో రైలు నడుపుతోంది. చాలా రాష్ట్రాల్లో ఆక్సిజన్‌కు డిమాండ్ పెరుగుతోంది. అయినా మేము దీనిని మేనేజ్ చేస్తున్నామని సిద్ధార్థ్ జైన్ స్పష్టం చేశారు.

ఈ సమస్య మహా అయితే నెల రోజులు ఉంటుందని, ప్రస్తుతం చాలా ఆక్సిజన్ అందుబాటులో ఉందని ఆయన చెప్పారు. ఇండియా మొత్తంలో 40 వేల టన్నుల ఆక్సిజన్ అందుబాటులో ఉన్నదని వెల్లడించారు. ఆక్సిజన్ కొరత నేపథ్యంలో పారిశ్రామిక అవసరాల కోసం ఆక్సిజన్ సరఫరాను కేంద్రం నిషేధించింది.

### చరిత్రలో నేటినిజం



( ఏప్రిల్ 21 శ్రీ రామ నవమి....)

–రాధశ్రీ

సెల్: 9494481210






# కెసిఆర్ త్వరగా కోలుకోవాలని కోరుతూ పలు ఆలయాల్లో పూజలు, హోమాలు..



హైదరాబాద్, ఏప్రిల్ 20:హైదరాబాద్ : కరోనా బారిన పడిన ముఖ్యమంత్రి కేసీఆర్ త్వరగా కోలుకోవాలని కోరుతూ రాష్ట్ర వ్యాప్తంగా టీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ఆలయాల అర్చకులు ప్రత్యేక పూజలు చేయించారు.. యాదాద్రి లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో అర్చకులు, ఆలయ సిబ్బంది కలిసి సుదర్శన హోమం నిర్వహించారు. ఏడు పాయల వన దుర్గాభవాని మాతా ఆలయంలో ఎమ్మెల్సీ శేరి సుభాష్ రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. సంగారెడ్డి జిల్లా ఝరాసంగం మండలం పరిధిలోని బర్దిపూర్ శ్రీ దత్తగిరి మహారాజ్ ఆశ్రమంలో మహా మృత్యుంజయ హోమం నిర్వహించారు. సీఎం కేసీఆర్ కరోనా నుండి త్వరగా కోలుకోవాలని కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామి దేవస్థానంలో ఎమ్మెల్యే రవిశంకర్, మల్యాల, కోడిమ్యాల మండల నాయకులు ప్రత్యేక పూజలు చేశారు. చిలుకూరు బాలాజీ ఆలయంలోనూ ప్రత్యేక పూజలు నిర్వహించారు. బషీర్ బాగ్ కనక దుర్గమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు, హోమం నిర్వహించారు. ఈ హోమంలో స్పోర్ట్స్ చైర్మన్ అల్లిపురం వెంకటేశ్వర్ రెడ్డి, టీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు రాఘవ, కిషోర్ గౌడ్ పాల్గొన్నారు. చిక్కడపల్లి శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో, సికింద్రాబాద్ గణపతి ఆలయంలోనూ కూడా కెసిఆర్ సంపూర్ణ ఆరోగ్యం కోసం ప్రత్యేక పూజలు చేయించారు నేతలు, కార్యకర్తలు..

# ఎస్పీఓటూ ఆధారిత అనుబంధ ఆక్సిజన్ సరఫరా వ్యవస్థను రూపొందించిన డీఆర్‌డీవో; ప్రస్తుత కొవిడ్ పరిస్థితుల్లో ఇదొక వరం

హైదరాబాద్, ఏప్రిల్ 20:'రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ' (డీఆర్‌డీవో), ఎస్పీఓటూ (రక్తంలో ఆక్సిజన్ స్థాయి) ఆధారిత అనుబంధ ఆక్సిజన్ సరఫరా వ్యవస్థను రూపొందించింది. పర్వతాల్లోని అత్యధిక ఎత్తైన ప్రాంతాల్లో విధులు నిర్వహించే సైనికుల కోసం దీనిని తయారు చేసింది. డీఆర్‌డీవోకు చెందిన, బెంగళూరులోని 'డిఫెన్స్ బయో ఇంజినీరింగ్ ఎలక్ట్రో మెడికల్ ల్యాబొరేటరీ' (డీఈబీఈఎల్) ఈ కొత్త వ్యవస్థకు రూపునిచ్చింది. ప్రాణాంతకంగా మారే 'హైపోక్సియా'కి (కణజాలానికి ఆక్సిజన్ అందని స్థితి) సైనికులు గురికాకుండా, ఎస్పీఓటూ స్థాయుల ఆధారంగా అనుబంధ ఆక్సిజన్‌ను ఈ వ్యవస్థ అందిస్తుంది. ప్రస్తుత కొవిడ్ పరిస్థితుల్లో ఈ స్వయంచాలిత వ్యవస్థ ఒక వరంగా కూడా మారగలదు.

రక్తం ద్వారా కణజాలానికి చేరే ఆక్సిజన్ సరిపోక, శరీరానికి కావలసిన కనీస శక్తి కూడా అందని పరిస్థితే హైపోక్సియా. ఒక వ్యక్తికి కరోనా వైరస్ సోకిన తర్వాత సరిగ్గా ఇదే పరిస్థితి తలెత్తుతోంది. ప్రస్తుత సంక్షోభానికి ప్రధాన కారకాల్లో ఇది కూడా ఒకటిగా మారింది.

వాతావరణ ఒత్తిళ్లు, తక్కువ ఉష్ణోగ్రతలు, తేమతో కూడిన పర్వతాగ్రాలపై సమర్థవంతంగా పనిచేసేలా ఈ వ్యవస్థ హార్డ్‌వేర్‌ను రూపొందించారు. క్షేత్రస్థాయి పరిస్థితుల్లో నమ్మకమైన పనితనాన్ని నిర్ధరించేలా ఈ వ్యవస్థలో పొందుపరిచిన సాఫ్ట్‌వేర్ భద్రత తనిఖీలు కీలకంగా ఉంటాయి.

మణికట్టు వద్ద ఏర్పాటుచేసే 'పల్స్ ఆక్సీమీటర్ మాడ్యూల్' నుంచి 'వైర్‌లెస్ ఇంటర్‌ఫేస్' ద్వారా ఒక వ్యక్తి ఎస్పీఓటూ స్థాయులను ఈ పరికరం గుర్తిస్తుంది. ఆ స్థాయులకు అనుగుణంగా శరీరానికి ఆక్సిజన్ సరఫరా జరిగేలా 'సోలెనాయిడ్ వాల్వ్'ను నియంత్రిస్తుంది. ఎక్కడికైనా మోసుకెళ్లగలిగే తేలికపాటి సిలిండర్ నుంచి సన్నటి పైపుల ద్వారా ఆక్సిజన్ సరఫరా జరుగుతుంది. ఒక లీటరు, ఒక కిలో బరువుతో 150 లీటర్ల ఆక్సిజన్ సరఫరా నుంచి 10 లీటర్లు, 10 కిలోల బరువుతో 1500 లీటర్ల ఆక్సిజన్ సరఫరా వరకు వివిధ పరిమాణాల్లో ఈ వ్యవస్థ లభిస్తుంది. నిమిషానికి రెండు లీటర్ల (ఎల్‌పీఎం) ఆక్సిజన్ పంపిణీతో 750 నిమిషాలు ఇది పని చేయగలదు.

క్షేత్ర స్థాయి పరిస్థితుల కోసం ఈ పరికరాన్ని దేశీయంగా రూపొందించడం వల్ల, చవకగా లభించడంతోపాటు మెరుగైన పనితీరును కనబరిచే ప్రత్యేక లక్షణాలతో ఇది ఉంటుంది. దీనిని ఇప్పటికే భారీగా ఉత్పత్తి కూడా చేస్తున్నారు.

ప్రస్తుత మహమ్మారి సమయంలో ఈ పరికరం ఒక వరం. కొద్దిపాటి కరోనా లక్షణాలతో ఇంట్లోనే ఉండి ఆక్సిజన్ ఆధారిత చికిత్స తీసుకునే రోగులకు దీని ద్వారా 2/5/7/10 ఎల్పీఎంతో ఆక్సిజన్ అందించవచ్చు. ఎస్పీఓటూ స్థాయి పడిపోతే ఈ స్వయంచాలిత వ్యవస్థ అలారం మోగిస్తుంది కాబట్టి, ఇంట్లో ఉపయోగించుకునేవారికి ప్రయోజనకారి. అవసరాన్ని బట్టి 2, 5, 7, 10 ఎల్పీఎం ఆక్సిజన్ సరఫరాను స్వయంచాలితంగా తగ్గిస్తుంది లేదా పెంచుతుంది. దీనివల్ల నమోదయ్యే సరైన ఆక్సిజన్ సరఫరా రేటు కారణంగా ప్రాణవాయువు ఆదా అయ్యి, ఎక్కువ కాలం వస్తుంది.

సాధారణ వ్యక్తులు కూడా దీనిని సులభంగా నిర్వహించే సౌలభ్యం ఉన్నందున, రోగి ఎస్పీఓటూ స్థాయులను నిరంతరం పర్యవేక్షించే శ్రమ వైద్య సిబ్బందికి తగ్గుతుంది. క్రమబద్ధీకరించిన 'ఫ్లో కంట్రోల్ వాల్వ్' (పీఎఫ్‌సీవీ) ద్వారా, తక్కువ ఆక్సిజన్ స్థాయుల వద్ద (ముందే ఏర్పాటు చేసిన ఒ90%, ఒ80%) ఆక్సిజన్ వినియోగాన్ని ఆదా చేయడానికి ( 0.5 ఎల్పీఎంతో 1-10 ఎల్పీఎం) 'ఆటోమేటెడ్ కాలిబ్రేటెడ్ వేరియబుల్ ఫ్లో కంట్రోల్' ఉపకరిస్తుంది. పరిమిత లక్షణాలున్న కొవిడ్ రోగికి, తక్కువ స్థాయి ఆక్సిజన్ వ్యవస్థ నుంచి 750 నిమిషాల పాటు ఆక్సిజన్ అందించే '10 కేజీలు-1500 లీటర్ల ఆక్సిజన్ వ్యవస్థ' వరకు అవసరం.

వైద్య వనరులు పరిమిత స్థాయిలో లభ్యమవుతున్న ఈ క్లిష్ట పరిస్థితుల్లో అందుబాటులోకి వచ్చిన ఈ స్వయంచాలక, సులభతర ఆక్సిజన్ సరఫరా వ్యవస్థ ఒక వరం వంటిది. ఈ పరికరం ఉత్పత్తి, దేశవ్యాప్తంగా భారీ స్థాయిలో నమోదవుతున్న కరోనా రోగుల నిర్వహణలో తలెత్తుతున్న ఇబ్బందులను తగ్గిస్తుంది.

# ఐఐఎం రోహ్తక్ వార్షిక సమావేశంలో ప్రసంగించిన కేంద్ర విద్యాశాఖ మంత్రి

హైదరాబాద్, ఏప్రిల్ 20:కేంద్ర విద్యాశాఖ మంత్రి శ్రీ రమేష్ పోఖ్రియాల్ 'నిశాంక్' ఈ రోజు ఐఐఎం రోహ్తక్ వార్షికోత్సవంలో విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ కాన్వొకేషన్ కార్యక్రమానికి ఎంబీఏ ప్రోగ్రాం నుంచి మొత్తం 480 మంది విద్యార్థులు, డాక్టోరల్ కార్యక్రమం నుంచి 12 మంది విద్యార్థులు హాజరయ్యారు. గ్రాడ్యుయేషన్ పొందిన విద్యార్థుల విజయాన్ని ప్రశంసిస్తూ శ్రీ పోఖ్రియాల్ అభినందనలు తెలిపారు. మన దేశానికి, సమాజానికి మేలు చేసేలా కష్టపడి పనిచేయాలని కూడా మంత్రి ఈ సందర్భంగా విద్యార్థులను ప్రోత్సహించాడు. విద్యార్థులు తమ ప్రతిభను ఉత్తమమైన రీతిలో ఉపయోగించుకోవాలని సూచించారు. భారతదేశ ఏ 75 మిషన్ సాకారానికి గాను విద్యార్థులు అర్థవంతంగా సహకరించాలని మంత్రి కోరారు. విద్యార్థుల భవిష్యత్ ప్రయత్నాలలో విజయం చేకూరాలంటూ శుభాకాంక్షలు తెలిపారు. ఐఐఎం తన విద్యార్థుల జనాభాలో లింగం, విద్యా వైవిధ్యాన్ని మెరుగుపరిచేలా అనూహ్యంగా పని చేసినందుకు మంత్రి అభినందించారు. ప్రధాన మంత్రి దృష్టి కోణమైన "బేటి బచావో మరియు బేటి పడావో.." మిషన్ దృష్టిని గ్రహించేందుకు గాను ఇన్‌స్టిట్యూట్ యొక్క ప్రయత్నాలు సహాయపడతాయని అన్నారు. గురుగ్రామ్‌లో కొత్త క్యాంపస్‌ను ప్రారంభించినందుకు, కొత్త కార్యక్రమాలు, నిర్వహణ విద్యలో మహిళలను సాధికారత సాధించినందుకు ఐఐఎం రోహ్తక్‌ను కేంద్ర మంత్రి శ్రీ పోఖ్రియాల్ అభినందించారు.

# భూమాత పవిత్రతను కాపాడుదాం...!

**(22 ఏప్రిల్ 'ప్రపంచ ధరిత్రి దినోత్సవం' సందర్భంగా)**

4.5 బిలియన్ ఏండ్ల క్రితం సూర్యుడి సృష్టి జరిగిన సమయంలో విడుదలైన దట్టమైన దుమ్ము మేఘాలు మరియు వాయువులు ఘనీభవించిన క్రమంలో భూమితో పాటు ఇతర గ్రహాలు ఏర్పడ్డాయని ప్రతిపాదించబడింది. భూమి పై పొర క్రస్ట్‌లో (5-20 కిమీ లోతు వరకు) సిలికేట్లతో కూడిన గట్టి పదార్థాలు పొర ఉంటుంది. రసాయన స్వభావాన్ని బట్టి లోపలి పొరలుగా మాంటిల్, ఔటర్ కోర్ మరియు ఇన్నర్ కోర్ అనబడే పొరలు ఉంటాయి. భూ పర్యావరణంలో నాలుగు ముఖ్య భాగాలు ఉన్నాయి. ధరణి చుట్టు ఆవరించబడివున్న వాయు భాగాన్ని 'వాతావరణం', జల భాగాన్ని 'జలావరణం', జీవ సంపదలను 'జీవావరణం'గా మరియు భూ భాగపు పై పొర నేలను 'శిలావరణం' అంటాం. భూ గ్రహంపై వృక్ష మరియు జంతు జీవకోటి ఉనికికి ప్రధాన కారణాలుగా గాలిలో ప్రాణవాయువు (ఆక్సీజన్) ఉండడం, నీటి లభ్యత మరియు జీవ మనుగడకు అనువైన ఉష్ణోగ్రతలు ఉండడమే అని గుర్తించాలి. పర్యావరణంలో దాదాపు 15 మిలియన్ల జీవరాసులు ఉన్నప్పటికీ, 2 మిలియన్ల వరకు జీవజాతులను మాత్రమే వైజ్ఞానికశాస్త్రం గుర్తించగలిగింది. ధరణిపై వెలసిన జీవరాసుల్లో వృక్షరాజ్యం మరియు జంతురాజ్యాలు ఉన్నాయి. ఇలాంటి జీవ వైవిధ్యాల నడుమ భూతలంపై ఓ అద్భుత సహజ ప్రకృతి నెలకొని, అనేక రకాల వృక్షాలు మరియు జంతువులతో ధరణిని స్వర్గ సీమగా మారింది. భూమాతను దేవతగా వర్ణించిన మానవ సమాజం ఆధునిక డిజిటల్ జీవనశైలితో భూతల పర్యావరణంలోని జీవావరణం, వాతావరణం మరియు శిలావరణం తమ సహజత్వాన్ని కోల్పోయి భయంకర వాయు/నేల/జల కాలుష్యానికి లోనవుతున్నాయి. దీనితో జీవరాసుల వైవిధ్య మనుగడ ప్రశ్నార్థకం కానున్నది.

భూ వాతావరణంలోని మార్పులు మరియు పర్యావరణ విచ్ఛిన్నతల నేపథ్యంలో భూగ్రహాన్ని నివాసయోగ్య ఆవరణంగా పరిరక్షించుకోవడానికి 1970 నుంచి ప్రతి ఏటా 22 ఏప్రిల్ రోజున ఐరాస సభ్యదేశాలు 'ప్రపంచ ధరిత్రి దినోత్సవం' వేడుకలను ఘనంగా నిర్వహించడం జరుగుతుంది. ఈ ఏడాది 'ప్రపంచ ధరిత్రి దినోత్సవం-2021' నినాదంగా 'ధరణి సహజత్వాన్ని పునర్ ప్రతిష్ట చేద్దాం (రీస్టోర్ అవర్ ఎర్త్)' అనబడే అంశాన్ని తీసుకున్నారు. వాతావరణంలో కార్బన్ డై ఆక్సైడ్ శాతం పెరగడంతో భూతాపం (గ్లోబల్ వార్మింగ్) జరుగుతోంది. మహానగరాలు గాలి కాలుష్య కేంద్రాలుగా మారాయి. జల వనరులు విషతుల్యం కావడంతో జల జీవ సంపద మనుగడ కష్టంగా మారింది. ఇలాంటి గాలి, నీరు, నేల కాలుష్యంతో సకల జీవులతో పాటు మానవ ఆరోగ్యం ప్రమాదంలో పడింది. కరోనా మహమ్మారి కల్లోలంలో విధించబడిన లాక్‌డౌన్ నేపథ్యంలో సహజంగానే కాలుష్యం కొంత మేరకు తగ్గినా, ప్రగతి రథచక్రాల పరుగులతో తిరిగి కాలుష్య భూతం తన ప్రతాపాన్ని చూపిస్తూ, పూర్వపు కాలుష్య స్థితి రావడానికి ఎంతో కాలం పట్టదు. కార్బన్ ఉద్గారాలను 2030 నాటికి కనీసం 45 శాతం తగ్గించగలిగితే భూతాప సమస్య కొంత మేరకు ఉపశమనాన్ని ఇస్తుందని నిపుణులు అంటున్నారు.

ప్రపంచ ధరిత్రి దినం వేదికగా పర్యావరణ కాలుష్యానికి కారణాలను ప్రచారం చేయడం, కాలుష్య సమస్యల కట్టడికి పౌర కార్యాచరణ వివరించడం, అడవులను రక్షించుకోవడం, వృక్ష సంపదలను పోషించడం, జీవ వైవిధ్యాన్ని కాపాడడం, గాలిలో కార్బన్ ఉద్గారాలను తగ్గించడం, సాంప్రదాయేతర తరగని ఇంధనాల వినియోగాన్ని పెంచడం, తరిగే సాంప్రదాయ శిలాజ ఇంధనాల వాడకాన్ని తగ్గించడం, ఎలక్ట్రిక్ వాహనాలను తీసుకురావడం, సౌర/పవన/అలలశక్తి ఉత్పత్తిని అనేక రెట్లు పెంచడం, పరిశ్రమలు/మురికి కాలువల జల కాలుష్యాన్ని అరికట్టడం, విచక్షణారహితంగా పురుగు మందులు వేయడం, ప్లాస్టిక్ వాడకాన్ని నిరోధించడం లాంటి అనేక అంశాల పట్ల అవగాహన కలిగించాలి. ప్రపంచ ధరిత్రి దినం రోజున చేపట్టాల్సిన కార్యక్రమాల్లో పుప్పొడి రేణువుల వ్యాప్తికి కారణమైన క్రిమి కీటకాలను రక్షించుకోవడం, ప్లాస్టిక్ వాడకాన్ని మన ఇంట్లోంచే తగ్గించడం, జీవ విచ్ఛిన్న ఉత్పత్తులనే వాడడం, ప్రతి ఒక్కరు మె?క్కలు నాటి రక్షించడం, వర్ష/వ్యర్థ నీటిని ఒడిసి పట్టుకోవడం, ఇంట్లో తోటలను పోషించడం, రసాయన ఎరువులు/ పురుగు మందుల వినియోగాన్ని తగ్గించడం, ప్రజా రవాణ/సైకిల్ వినియోగాన్ని పెంచడం, కార్బన్ ఉద్గారాలను తగ్గించడం, విద్యుత్తును ఆదా చేయడం, వన్యప్రాణులను కాపాడుకోవడం, పరిసరాల్ని పరిశుభ్రంగా ఉంచుకోవడం, ఆహార వ్యర్థాలను తగ్గించడం, పిల్లలకు పర్యావరణ పరిరక్షణ పట్ల అవగాహన కల్పించడం లాంటి అంశాలను చేపట్టవచ్చు. పర్యావరణ పరిరక్షణ అవసరాన్ని విద్యాలయాల్లో చిన్నారులకు అవగాహన పరచడం మనందరి కనీస బాధ్యత.

అమ్మ ఒడి తరువాత అత్యున్నత స్థానం మనల్ని అక్కున చేర్చుకున్న భూమాతకే చెందుతుంది. మానవ ఆవాసమైన పుడమి తల్లికి హాని తలపెట్టడం, మనం కూర్చున్న కొమ్మను మనమే నరుక్కోవడం లాంటిదే అని గమనించాలి. డిజిటల్ యుగపు నవ్య మానవుడు అభివృద్ధి పేరున తలపెట్టిన అనాలోచిత కార్యాలతో తాగే నీరు, పీల్చే గాలి, నివసించే నేల లాంటి పంచభూతాలు కాలుష్య విష కోరల్లో చిక్కుకుంటున్నాయి. ఇలాంటి తీవ్ర కాలుష్యంతో ప్రజారోగ్యం ప్రమాదంలో పడింది. కాలుష్య భూతం చేతులో ఓడిన భూమాత దీన మూగ రోదనలు వినగలిగిన విజ్ఞులకు మాత్రమే వినిపిస్తాయి. కాలుష్యంతో భూమాతను కాటు వేస్తే కరోనా లాంటి మహమ్మారులు జనించి, విశ్వ మానవాళిని కబళించే ప్రమాదాలు మరి కొన్ని జరిగే అవకాశం ఉందని గుర్తుంచుకోవాలి. మనిషి లేకుండా భూమాత ఉండగలదు, కాని భూమాత లేకుండా మనిషి మనుగడ అసాధ్యమని మరువరాదు. అమ్మను ప్రేమించినట్లే, భూమాతను ప్రేమిద్దాం. కాలుష్య భూతం పై యుద్ధాన్ని ప్రకటిద్దాం.



- డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

# ఫార్మా పరిశ్రమకు చెందిన నాయకులతో సంభాషించిన - ప్రధానమంత్రి

హైదరాబాద్, ఏప్రిల్ 20:ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ, ఔషధ పరిశ్రమలకు చెందిన నాయకుల తో దృశ్య మాధ్యమం ద్వారా సంభాషించారు. మహమ్మారికి వ్యతిరేకంగా పోరాటం లో ఫార్మా రంగం పోషించిన కీలక పాత్రను ప్రధానమంత్రి ఈ సందర్భంగా ప్రశంసించారు.

ఇటువంటి క్లిష్ట పరిస్థితుల్లో కూడా ఫార్మా పరిశ్రమ చేస్తున్న కృషి ని ప్రధానమంత్రి శ్రీ మోదీ ప్రశంసించారు.

ఫార్మా పరిశ్రమ ప్రయత్నాల వల్ల నే, ఈరోజు భారతదేశం " ప్రపంచ ఔషధశాల" గా గుర్తింపు పొందిందని, ప్రధానమంత్రి శ్రీ మోదీ అభివర్ణించారు. మహమ్మారి సమయంలో ప్రపంచంలోని 150 కి పైగా దేశాలకు అవసరమైన మందులను, భారతదేశం అందుబాటులో ఉంచిందని, ఆయన పేర్కొన్నారు. అనేక సవాళ్లు ఎదురైనప్పటికీ, భారత ఫార్మా పరిశ్రమ, గత ఏడాది ఎగుమతుల్లో 18 శాతం వృద్ధిని నమోదు చేసిందని, ఇది దాని సామర్థ్యాన్ని చూపుతుందని, ప్రధానమంత్రి పేర్కొన్నారు.

వైరస్ యొక్క రెండవ దశతో పాటు ఈ దశలో పెరుగుతున్న కేసుల సంఖ్య గురించి ప్రధానమంత్రి శ్రీ మోదీ ప్రస్తావిస్తూ, అవసరమైన అనేక ఔషధాల ఉత్పత్తిని పెంచడానికి ఫార్మా పరిశ్రమ చేసిన కృషిని ప్రశంసించారు. రెమ్‌డెసివిర్ (ఖీవఎటవబతిలతితీ) వంటి ఇంజెక్షన్ల ధరను తగ్గించినందుకు ఆయన వారిని మెచ్చుకున్నారు. మందులు మరియు అవసరమైన వైద్య పరికరాల సరఫరా సజావుగా సాగాలని, ఎటువంటి ఇబ్బందులు లేని సరఫరా వ్యవస్థ కొనసాగాలనీ, ప్రధానమంత్రి శ్రీ మోదీ, ఫార్మా పరిశ్రమ వర్గాలను కోరారు. లాజిస్టిక్స్, రవాణా వంటి సౌకర్యాల కోసం, ప్రభుత్వ మద్దతు ఉంటుందని కూడా ప్రధానమంత్రి శ్రీ మోదీ ఈ సందర్భంగా పేర్కొన్నారు.

కోవిడ్‌తో పాటు భవిష్యత్తులో సంభవించే బెదిరింపులపై మరింత పరిశోధనలు చేయాలని ఆయన పరిశ్రమ వర్గాలను కోరారు. వైరస్ ను ఎదుర్కోవడంలో ముందడుగు వేయడానికి, ఇది, మనకు, ఎంతగానో సహాయపడుతుందని ఆయన అన్నారు.

ఫార్మా పరిశ్రమ సహకారం కోరుతూ, కొత్త ఔషధాలు మరియు నియంత్రణ ప్రక్రియల కోసం ప్రభుత్వం సంస్కరణలు చేపడుతుందని, ప్రధానమంత్రి శ్రీ మోదీ, ఈ సందర్భంగా, హామీ ఇచ్చారు.

ఈ సందర్భంగా, ఫార్మా పరిశ్రమ నాయకులు మాట్లాడుతూ, ప్రభుత్వం నుండి తమకు అందుకున్న సహాయ సహకారాలను, ప్రశంసించారు. తయారీ మరియు రవాణా కార్యకలాపాలను పర్యవేక్షిస్తూ, ఔషధాల లభ్యతను నిర్ధారించడం కోసం గత ఏడాది వారు చేసిన ప్రయత్నాలను, వారు ప్రధానమంత్రి కి వివరించారు. తయారీ, రవాణా, లాజిస్టిక్స్ తో పాటు ఇతర అనుబంధ సేవల కోసం ఫార్మా హబ్ లలో కార్యకలాపాలను గరిష్ట స్థాయిలో నిర్వహిస్తున్నట్లు వారు పేర్కొన్నారు. కొన్ని ఔషధాల కోవిడ్ చికిత్స ప్రోటోకాల్ కు అపూర్వమైన డిమాండ్ పెరిగిన నేపథ్యంలో, దేశంలో మొత్తం ఔషధ డిమాండ్ ను తీర్చడానికి తీసుకుంటున్న చర్యలపై సమాచారాన్ని వారు ఈ సందర్భంగా ఒకరికొకరు తెలియజేసుకున్నారు.

ఈ సమావేశంలో - కేంద్ర ఆరోగ్య మంత్రి శ్రీ హర్ష వర్ధన్; కేంద్ర ఆరోగ్య శాఖ సహాయ మంత్రి శ్రీ అశ్వినీ కుమార్ చౌబే; కేంద్ర రసాయనాలు, ఎరువుల శాఖ మంత్రి శ్రీ డి.వి.సదానంద గౌడ; కేంద్ర సహాయ మంత్రి (సి ఒ ఎఫ్) శ్రీ మాన్ సుఖ్ మాండవీయ; ప్రధానమంత్రి ముఖ్య కార్యదర్శి, నీతీ ఆయోగ్ సభ్యుడు (హెచ్) డాక్టర్ వి.కే.పాల్; క్యాబినేట్ కార్యదర్శి; కేంద్ర ఆరోగ్య శాఖ కార్యదర్శి; కేంద్ర ఫార్మాస్యూటికల్ కార్యదర్శి; ఐ.సి.ఎం.ఆర్. డైరెక్టర్ జనరల్ డాక్టర్ బలరాం భార్గవ తో సహా కేంద్ర మంత్రిత్వ శాఖలు, ఇతర కేంద్ర ప్రభుత్వ శాఖలకు చెందిన పలువురు అధికారులు కూడా కూడా పాల్గొన్నారు.

# కోవిడ్ -19 కు సంబంధించి ప్రజారోగ్య స్పందనపై దేశంలోని ప్రముఖ వైద్యులతో సమీక్ష నిర్వహించిన ప్రధానమంత్రి శ్రీ నరేంద్రమోదీ

హైదరాబాద్, ఏప్రిల్ 20దేశంలో కోవిడ్ వాక్సినేషన్ పురోగతి, కోవిడ్ -19 పరిస్థితులపై ప్రధానమంత్రి నరేంద్రమోదీ దేశవ్యాప్తంగా గల వైద్యులతో సంప్రదింపులు జరిపారు. కరోనావైరస్ మహమ్మారి కాలంలో వైద్యులు, మెడికల్ పారామెడికల్‌సిబ్బంది దేశానికి అందించిన సేవలను ప్రధానమంత్రి కొనియాడారు.

గత సంవత్సరం ఇదే సమయంలో మన దేశ వైద్యులు కష్టపడి పనిచేయడం, దేశం అనుసరించిన వ్యూహం వల్ల మనం కరోనా వైరస్ ఉధృతిని నిలువరించ గలిగామని అన్నారు. ఇప్పుడు దేశం రెండోదశ కరోనా వైరస్ ప్రభావాన్ని ఎదుర్కొంటున్నదని, అందరు వైద్యులు, ఫ్రంట్‌లైన్ వర్కర్లు ఈ మహమ్మారిని తమ శక్తిని కేంద్రీకరించి ఎదుర్కొంటూ లక్షలాది మంది ప్రజల ప్రాణాలు కాపాడుతున్నారని అన్నారు.

అత్యావశ్యక మందుల సరఫరా, సూది మందులు, ఆక్సిజన్ తగినంతగా అందుబాటులో ఉండేట్టు చూడడానికి కేంద్ర ప్రభుత్వం ఇటీవల పలు కీలక చర్యలు తీసుకున్నట్టు ప్రధానమంత్ర తెలిపారు. ఇందుకు సంబంధించి రాష్ట్రప్రభుత్వాలకు తగిన మార్గదర్శకాలు జారీచేసినట్టు ఆయన తెలిపారు.

కరోనావైరస్ పై పోరాటంలో వాక్సినేషన్ అనేది అతిపెద్ద ఆయుధమని అంటూ ప్రధానమంత్రి శ్రీ నరేంద్రమోదీ, మరింత ఎక్కువమంది పేషెంట్లు వాక్సిన్ వేసుకునేలా ప్రోత్సహించాలని అన్నారు.

కోవిడ్ చికిత్స, నిరోధానికి సంబంధించి ప్రచారంలో ఉన్న రకరకాల పుకార్లపై ప్రజలకు సరైన అవగాహన కల్పించాల్సిందిగా ప్రధానమంత్రి వైద్యులకు పిలుపునిచ్చారు. ప్రస్తుత క్లిష్ట సమయంలో ప్రజలు అనవసరంగా భయపడి బాధితులు కారాదని అన్నారు. ఆస్పత్రులలో చేరిన పేషెంట్లకు తగిన చికిత్సతోపాటు, వారికి తగిన విధంగా కౌన్సిలింగ్ ఇవ్వాలని ప్రధానమంత్రి సూచించారు. ఇతర వ్యాధులకు సంబంధించి అత్యవసరం కాకపోతే, చికిత్స అందించడానికి టెలిమెడిసిన్ విధానాన్ని వాడుకోవాలని ఆయన సూచించారు.

ప్రస్తుతం కోవిడ్ మహమ్మారి ద్వితీయ శ్రేణి, తృతీయ శ్రేణి పట్టణాలలో వేగంగా విస్తరిస్తున్నదని అన్నారు. ఇలాంటి ప్రాంతాలలో వనరులను ఉన్నతీకరించడానికి వేగవంతమైన కృషి జరగాలన్నారు. ద్వితీయ, తృతీయశ్రేణి పట్టణాలలో ఉన్న తమ సహచరులతో సంబంధాలు పెట్టుకుని వారికి ఆన్‌లైన్ ద్వారా కన్సల్టేషన్ ఇచ్చి కోవిడ్ కు సంబంధించిన అన్ని ప్రొటోకాల్స్ సక్రమంగా పాటించేలా చూడాలని ఆయన అన్నారు.

ప్రధానితో సమావేశం సందర్భంగా వైద్యులు తమ అనుభవాలను తెలియజేశారు. కోవిడ్ మహమ్మారిని ఎదుర్కోవడంలో ప్రధానమంత్రి శ్రీ నరేంద్రమోదీ నాయకత్వానికి వారు అభినందనలు తెలిపారు. ఆరోగ్య సంరక్షణ మౌలిక సదుపాయాలను వారుఏవిధంగా పెంచినదీ వివరించారు. ప్రజలు మాస్కు ధరించడం, సామాజిక దూరం పాటించడం వంటి వాటి ప్రాధాన్యతను వారు పునరుద్ఘాటించారు. అలాగే కోవిడ్‌తో సంబంధం లేని పేషెంట్లకు వైద్య మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉంచడం గురించి వారు నొక్కి చెప్పారు. సరైన రీతిలో మందులు వాడకపోవడం పై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్టు వారు తెలిపారు.

ఈ సమావేశంలో కేంద్ర ఆరోగ్యశాఖమంత్రి శ్రీ హర్షవర్ధన్, కేంద్ర ఆరోగ్య శాఖ సహాయమంత్రి శ్రీ అశ్విని కుమార్ చౌబే, కేంద్ర రసాయనాలు, ఎరువుల శాఖ సహాయ మంత్రి శ్రీ డి.వి.సదానంద గౌడ, ప్రధానమంత్రికి ప్రిన్సిపుల్ సెక్రటరీ మన్‌సుఖ్ మాండవీయ, నీతి ఆయోగ్ (హెచ్) సభ్యుడు డాక్టర్ వి.కె. పాల్, కేబినెట్ సెక్రటరీ, కేంద్ర ఆరోగ్య కార్యదర్శి, కేంద్ర ఫార్మాసూటికల్ కార్యదర్శి, ఐసిఎంఆర్ డిజి డాక్టర్ బలరామ్ భార్గవ , వివిధ మంత్రిత్వశాఖలు, కేంద్ర ప్రభుత్వానికి చెందిన అధికారులు పాల్గొన్నారు.

# తెలంగాణ సచివాలయానికి కరోనా కాటు ?60 మందికి ఉద్యోగులకు పాజిటివ్.

హైదరాబాద్, ఏప్రిల్ 20: తెలంగాణ సచివాలయంలో కరోనా కేసులు రోజు రోజుకి పెరిగిపోతున్నాయి? ఇప్పటికే ప్రధాన కార్యదర్శి సోమేష్ కుమార్ కరోనా గురై తిరిగి కోలుకుని విధులకు హాజరవుతున్నారు? ఈ నేపథ్యంలో బిఆర్ కె భవన్ లోని వివిధ శాఖల ఉద్యోగులకు కరోనా పరీక్షలు నిర్వహించారు? 60 మందికి కరోనా పాజిటివ్ వచ్చింది.. దీంతో అన్ని శాఖల సిబ్బంది బయపడిపోతున్నారు?కరోనా ఉధృతి నేపథ్యంలో వర్క్ ఫ్రం హోం ఇవ్వాలని ఉద్యోగులు కోరుతున్నారు. 50 శాతం సిబ్బంది హాజరుకు అనుమతించాలని సిఎస్ ను కోరారు?అలాగే అందరికీ వ్యాక్సినేషన్ ఇవ్వాలనే డిమాండ్ ను ప్రభుత్వం ముందు ఉంచారు.. సచివాలయంలో కేసులు పెరుగుతుండటంతో నేడు అధిక సంఖ్యలో ఉద్యోగులు సెలవులు పెట్టారు.. దీంతో సచివాలయం కళ తప్పింది

# హైకోర్టు మొట్టికాయలతో రాత్రి కర్ఫ్యూ పెట్టి చేతులు దులుపుకున్నారు: విజయశాంతి



హైదరాబాద్, ఏప్రిల్ 20: కరోనా నియంత్రణపై హైకోర్టు వేసిన మొట్టికాయలతో రాత్రి కర్ఫ్యూ పెట్టి కెసిఆర్ చేతులు దులుపుకున్నారంటూ బిజెపి నేత విజయశాంతి విమర్శించారు.. ఈ మేరకు ఆమె వరుస ట్విట్ లు చేశారు.. సరిగ్గా కిందటేడాది ఏం తప్పులు జరిగాయో? అవే ఇప్పుడూ పునరావృతం అవుతున్నందువల్లే రాష్ట్రంలో కరోనా సెకండ్ వేవ్ తీవ్ర రూపం దాల్చిందనే విషయాన్ని సర్కారు గ్రహించడం లేదని,, గుణపాఠం నేర్చుకోవడం లేదని టిఆర్ ఎస్ సర్కార్ ను ఎత్తిపొడిచారు?రాత్రివేళ కర్ఫ్యూ పెట్టి చేతులు దులుపుకున్నారు కానీ, పగటి పూట ఎలాంటి నియంత్రణలూ లేకుండా ఈ ప్రభుత్వం సాధించదలుచుకుంది ఏమిటో అర్థం కావడం లేదంటూ విజయశాంతి ఎద్దేవా చేశారు.. . ఈ నేతలను, ఈ సర్కారును నమ్ముకుంటే ఇంతే సంగతులని జనానికి బాగా అర్థమయ్యేలా చేస్తున్నారంటూ ఆమె మండిపడ్డారు. కాగా, కరోనా బారిన పడిన సీఎం కేసీఆర్ గారు అంతకుముందు మాస్క్ లేకుండా సమీక్షలు నిర్వహించి, సభల్లో పాల్గొన్న ఫొటోలు మీడియాలోను, సోషల్ మీడియాలోను చక్కర్లు కొడుతున్నాయని అన్నారు? తెలంగాణలో మాస్కులు ధరించనివారికి వేలకు వేలు ఫైన్లు వేస్తున్నారని, . ఆ ఫైన్ ఏదో మాస్కు ధరించని కేసీఆర్ గారికి, ఆ పార్టీ నేతలకు కూడా వేసి ఉంటే ఇప్పుడు కెసిఆర్ కరోనా భారీన పడి ఉండే వారు కాదన్నారు? పలువురు మంత్రులు, ప్రజాప్రతినిధులు, టీఆర్ఎస్ నాయకులు వారి అధినేత బాటలోనే నడుస్తూ నిర్లక్ష్యానికి నిలువుటద్దంగా మారి కరోనా వ్యాప్తికి కారకలవుతున్నారంటూ విజయశాంతి ఫైర్ అయ్యారు?

# కెసిఆర్, మన్మోహన్ సింగ్ లు త్వరగా కోలుకోవాలి-పవన్ కల్యాణ్



హైదరాబాద్, ఏప్రిల్ 20:తెలంగాణ ముఖ్యమంత్రి కెసిఆర్, భారత మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ లు కరోనా భారీన పడిన నేపథ్యంలో జనసేన అధినేత పవన్ కల్యాణ్ స్పందించారు.. కేసీఆర్ త్వరగా కోలుకోవాలని ఓ ప్రకటన విడుదల చేశారు. ఆయన కోలుకుని ఎప్పటిలాగే ప్రజా సేవలో నిమగ్నం కావాలని దేవుడిని ప్రార్థిస్తున్నానని పేర్కొన్నారు. అలాగే, మన్మోహన్ సింగ్ ఎయిమ్స్‌లో చేరినట్లు సమాచారం అందిందని పవన్ కల్యాణ్ అన్నారు. ఆయన కూడా త్వరగా కోలుకోవాలని తాను దేవుడిని ప్రార్థిస్తున్నానని ఆయన చెప్పారు. కాగా, పవన్ కల్యాణ్‌కు కూడా కరో?నా సోకడంతో ఆయన ప్రస్తుతం హోం క్వారంటైన్‌లో ఉండి అక్కడే చికిత్స కోవడంతో ప్రస్తుతం ఆయన కోలుకున్నారు.. నేడు జరిపిన టెస్ట్ లో పవన్ కు నెగిటివ్ వచ్చింది.. అయినప్పటికి ముందు జాగ్రత్త చర్యగా ఆయన మరికొన్ని రోజులు ఫామ్ హౌజ్ లోనే ఉండనున్నారు..

# స్టార్టప్ ఇండియా సీడ్ ఫండ్ పథకాన్ని ప్రారంభించిన పీయూష్ గోయల్

హైదరాబాద్, ఏప్రిల్ 20:రైల్వేలు, వాణిజ్యం ఒ పరిశ్రమ, వినియోగదారుల వ్యవహారాలు, ఆహారం ఒ ప్రజా పంపిణీ శాఖ మంత్రి పీయూష్ గోయెల్ సోమవారం స్టార్టప్ ఇండియా సీడ్ ఫండ్ స్కీం (ఎస్ఐఎస్ఎఫ్ఎస్)ను ప్రారంభించారు. భావనల రుజువు, నమూనాల అభివృద్ధి, ఉత్పత్తి పరీక్షలు, మార్కెట్ ప్రవేశం, వాణిజ్యీకరణ చేసేందుకు స్టార్టప్‌లకు ఆర్థిక సహాయాన్ని అందించడం ఈ పథకం లక్ష్యం. స్టార్టప్ ఇండియా చొరవ ఐదవ వార్షికోత్సవం సందర్భంగా 16 జనవరి, 2021న ఏర్పాటు చేసిన ప్రారంభ్ః స్టార్టప్ ఇండియా ఇంటర్నేషనల్ సమ్మిట్ ను ఉద్దేశించి ప్రారంభోపన్యాసం చేస్తూ ఈ పథకాన్ని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రకటించారు. ఇందుకోసం ఉద్దేశించిన రూ. 945 కోట్ల కార్పస్ నిధిని, భారతదేశ వ్యాప్తంగా ఉన్న అర్హులైన ఇన్‌క్యుబేటర్లు ( స్టార్టప్‌లకు యాజమాన్యం, నిర్వహణ తదితర అంశాల్లో శిక్షణను ఇచ్చే సంస్థలు) ద్వారా అర్హులైన స్టార్టప్‌లకు రానున్న నాలుగేళ్ళల్లో అందించనున్నారు. దాదాపు 300 ఇన్‌క్యుబేటర్ల ద్వారా సుమారు 3,600 స్టార్టప్‌లకు ఈ పథకం మద్దతు కల్పిస్తుందని అంచనా. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రకటించిన 3 నెలల్లోనే ఈ పథకాన్ని ప్రారంభిస్తున్నామని, ఇటీవలి కాలంలో ఇంత వేగంగా ప్రారంభించినది ఈ పథకాన్నేనని గోయల్ చెప్పారు. ప్రస్తుతం కాలం క్లిష్టంగా ఉన్నప్పటికీ, తమ సంకల్పం బలంగా ఉందని, గతంలో ఎన్నడూ లేని విధంగా స్టార్టప్‌లను సాధికారం చేయడం తమకు అత్యంత ముఖ్యమని అన్నారు. ఎస్ఐఎస్ఎఫ్ఎస్ సీడ్ ఫండింగ్‌ను పరిరక్షించడమే కాక, ఆవిష్కరణకు స్ఫూర్తిని ఇచ్చి, పరివర్తన తేగల భావనలకు మద్దతునిచ్చి, అమలుకు సౌలభ్యాన్ని కల్పించి, స్టార్టప్ విప్లవాన్ని ప్రారంభిస్తుందని మంత్రి తెలిపారు. ఈ పథకం బలమైన స్టార్టప్ వాతావరణాన్ని సృష్టిస్తుందన్నారు. ముఖ్యంగా, భారతదేశంలో తరచుగా నిధుల కొరత ఉండే టైర్ 2, టైర్ 3 పట్టణాలు దీని నుంచి లబ్ధి పొందుతాయన్నారు. తాను ప్రత్యేకంగా గ్రామీణ ప్రాంతాలకు చెందిన ఆవిష్కర్తలు ముందుకు వచ్చి, ఈ పథకం ద్వారా లబ్ధి పొందాలని కోరుకుంటున్నానని మంత్రి చెప్పారు. ప్రధానమంత్రి మోడీ మార్గదర్శనంలో, భారతదేశంలోని స్టార్టప్ వాతావరణంలో బలమైన మార్పును తెచ్చేందుకు డిపిఐఐటి అవిశ్రాంతంగా పని చేసిందని గోయల్ అన్నారు. ఈ శాఖ ద్వారాలు తెరిచి, ఎటువంటి అభిప్రాయాలు లేకుండా, పెద్ద ఎత్తున యువత ఆవిష్కరణ కార్యకలాపాల్లో పాల్గొనేందుకు ప్రోత్సహించి, ఆహ్వానిస్తుందని ఆయన హామీ ఇచ్చారు. ఉపాధి కోరుకుంటున్నవారి నుంచి ఉపాధి కల్పించే వారి వరకూ దృక్పథంలోనూ, వైఖరిలోనూ మార్పు వచ్చిందని, ఇది నవీన భారతదేశానికి స్టార్టప్‌లు వెన్నుముక కావడానికి తోడ్పడుతోందని మంత్రి వివరించారు. స్టార్టప్ ఇండియా సీడ్ ఫండ్ స్కీం భావనలు, వాటి అమలుకు మధ్య వారధిలా వ్యవహరిస్తుందన్నారు. స్టార్టప్ పర్యావరణ వ్యవస్థలో స్వతంత్ర, అత్యున్నత స్థాయి లక్ష్యం వ్యవస్థాపకతను ప్రోత్సహించడమే కాక, ఆవిష్కరణలను గుర్తించే సంస్కృతిని సృష్టిస్తాయన్నారు. భారతీయ స్టార్టప్‌ల పరివర్తనా సామర్థ్యానికి 2020 ఒక హామీ పత్రంలాంటిదని- తమ శక్తి, ఉత్సాహంతో స్టార్టప్‌లు సమర్థవంతమైన, సరసమైన పరిష్కారాలతో ముందుకు రావడంతో భారతదేశ వ్యాప్తంగా నిత్యావసర వస్తువుల సరఫరా చివరి మైలు వరకు అందించడం సాధ్యమైందని గోయల్ చెప్పారు. యువ వాణిజ్యవేత్తల సామర్థ్యాన్ని, చురుకుదనాన్ని, అంకితభావాన్ని ఆయన కొనియాడారు. భారతీయ స్టార్టప్‌లు కేవలం దేశం కోసమే కాక సకల మానవాళి కోసం శిక్షణ పొందుతూ, ఉత్పత్తి చేస్తూ, ఆవిష్కరణలు చేస్తున్నాయన్నారు.

# మితాహారం, కాలానుగుణ ఆహారం ఆరోగ్యానికి కీలకం



హైదరాబాద్, ఏప్రిల్ 20:ప్రపంచ కాలేయ దినోత్సవం సందర్భంగా ఈ రోజు జరిగిన కార్యక్రమానికి కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ సహాయ మంత్రి అశ్వినీ కుమార్ చౌబే అధ్యక్షత వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రపంచ కాలేయ దినోత్సవానికి ఎంతో ప్రాముఖ్యం ఉందన్నారు. ''మానవ దేహంలో ముఖ్యమైన కార్యకలాపాలను మౌనంగా నిర్వహించే అతి పెద్ద కీలక అవయవం కాలేయం. అసహజమైన, అసాధారణమైన జీవన శైలి కారణంగా కాలేయానికి తీవ్రంగా దెబ్బ తగిలే ఆస్కారం ఉంది. దెబ్బతిన్న కాలేయం తిరిగి సక్రమంగా నిలదొక్కుకోలేని పక్షంలో ఇది నాన్ ఆల్కహాలిక్ ఫ్యాటీ లివర్ (ఎన్.ఎ.ఎఫ్.ఎల్.డి.) అనే వ్యాధికి దారితీసే ఆస్కారం ఉంది. ఒకసారి ఈ పరిస్థితి తలెత్తితే అందుకు తగిన నివారణ మార్గం కూడా మనకు అందుబాటులో లేదు. ఈ పరిస్థితుల్లో ఈ వ్యాధికి సంబంధించిన రుగ్మతలేవీ తలెత్తకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవడం తప్ప గత్యంతరం లేదు.'' అని ఆయన అన్నారు. అందువల్ల వేగంగా సాగుతున్న జీవన శైలి సాగిస్తున్న ప్రజలు నియమబద్ధమైన జీవన విధానం, ఆహారపు అలవాట్లు పాటించి బాధ్యతాయుతంగా మెలగవ సిన అవసరం ఉందని ఆయన అన్నారు.

ఎన్.ఎ.ఎఫ్.ఎల్.డి. అనే రుగ్మత భారతదేశంలో చాపకింద నీరుగా వ్యాపిస్తోందని, ఇది ఆందోళనకరమని ఆయన అన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఇది వందకోట్ల మందికి (అంటే ప్రపంచ జనాభాలో 20-30శాతం మందికి) సంభవించే అవకాశం ఉందని అంచనా వేశారని తెలిపారు. భారతదేశంలో ఇది 9నుంచి 32శాతం వరకూ వ్యాపించే ఆస్కారం ఉందని, అంటే,.. ప్రతి 10మంది భారతీయుల్లో ఒకరినుంచి ముగ్గురి వరకూ ఫ్యాటీ లివర్ సంబంధిత రుగ్మత కలిగి ఉంటారని ఆయన చెప్పారు. అందువల్ల ఈ వ్యాకులత కారణంగా జనం తమ జీవితాలను, తమవారి జీవితాలు దెబ్బతినకుండా తగిన జాగ్రత్త వహించాలని, వ్యాధికి దారితీసే దూమపానం, మద్యపానం, జంక్ ఫుడ్, వంటి వాటిని మానేయాలని కేంద్ర మంత్రి సూచించారు. తమతమ కుటుంబ సభ్యుల్లో గురక పెట్టడం వంటి వ్యాధి లక్షణాలను పసిగడితే వెంటనే వైద్య సలహాలు తీసుకోవాలన్నారు. ఈ విషయంలో మితాహారం పాటించడం మంచిదని, ఆహారం విషయంలో పొదుపుగా వ్యవహరించడం, చాలావరకు కాలానుగుణంగా, ఏ రుతువులో దొరికే ఆహారాన్ని ఆకాలంలో తినడం అవసరమని, మన ఆయుప్రవ ాణం పెరిగేందుకు ఇది దోహదపడుతుందని చెప్పారు. కాలేయ రక్షణ వ్యవహారాలకు సంబంధించి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు సంతృప్తికరంగా ఉన్నాయని, ఎన్.ఎ.ఎఫ్.ఎల్.డి. రుగ్మత, తత్సంబంధిత వ్యాధుల నిరోధానికి జాతీయ స్థాయిలో ఒక సమగ్ర కార్యక్రమం చేపట్టాలని గుర్తించిన దేశం ప్రపంచంలో భారతదేశం ఒక్కటేనని అన్నారు. క్యాన్సర్, మధుమేహం, గుండె సంబంధ వ్యాధులు వంటి వాటి నిరోధానికి ఒక జాతీయ స్థాయి ప్రధాన కార్యక్రమంగా దీన్ని చేపట్టినట్టు ఆయన చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా ప్రబలే వ్యాధుల్లో ఎక్కువ భాగం భారతదేశంలోనే ఎక్కువని, అయితే జీర్ణ సంబంధమైన వ్యాధు లన్నింటికీ కారణాలు కాలేయ సంబంధమైనవేనని, ఈ జాతీయ కార్యక్రమం ద్వారా పటిష్టంగా వ్యాధి నిరోధక చర్యలు తీసుకోవచ్చని కేంద్రమంత్రి అన్నారు.



# సీతారామస్వామి! - మేం చేసిన నేరములేమి? మము బ్రోవమనీ చెప్పవే సీతమ్మ తల్లి



-శారద శృంగేరి
9490 26 1119

**ప్రస్తుత విపత్కర పరిస్థితి నేపథ్యం:**

త్రేతాయుగంలో రాముడుగా జన్మించి మానవజాతికే ఆదర్శ పురుషుడుగా అవతరించిన ఓ రామా! శ్రీరామ. ''కరోనా మహమ్మారి'' రెండొవసారి విలయతాండవం చేస్తూ, యావత్ భారతదేశాన్ని వణికిస్తోంది. ఈ భూమండలం మీద పర్వతాలు నిలిచి ఉన్నంత కాలం, నదులు, ప్రహిస్తున్నంత కాలం విపత్తు సంభవించిన ప్రతిసారి భగవంతుడు అవతారపురుషుడుగా జన్మించి మానవాళికి ఆపత్ భాంధవుడై నిలుస్తున్న శ్రీ సీతారామస్వామి, ఆనాడు రావణుడు అనే రాక్షసుడు బ్రహ్మవద్ద వరాలుపొంది దేవతలను జయించి మునులను వేధిస్తున్నాడు. వానికి దేవ గంధర్వ యక్ష రాక్షసుల వల్ల చావులేదు. దేవతల ప్రార్థనలు మన్నించి, శ్రీ మహా విష్ణువైన నీవు శ్రీ రామునిగా అవతారమెత్తిన ఓ రామా! వానిని హతంచేయడానికి నరుడై జన్మించిన నీకు తోడుగా ఆదిశేషుడు లక్ష్మణునిగా, శంఖ చక్రములు భరత శత్రుఘ్నులుగా అవతరించారు. శ్రీమహాలక్ష్మి సీతగా అయోనిజయై అవతారమెత్తిన శ్రీరామా దుష్టశిక్షణ, శిష్టరక్షణ కావించారు.

**శ్రీరాముని అవతార ప్రాశస్త్యం:**

నాడు త్రేతాయుగములో రామావతారం సీతారాములచరిత్ర మార్గనిర్దేశం అంటారు. ఏ యుగంలో నైనా భగవంతుడు అవతార పురుషుడుగా జన్మించి మానవజన్మకు ఉన్న ఔన్నత్యాన్ని పునరుద్ధరించడానికి, అన్ని జన్మలకన్నా మానవజన్మ గొప్పదనీ, అంతటి మహోన్నత జన్మ పొందిన మానవులు ఆదర్శవంతంగా ఎలా ఉండాలో, రామాయణ గ్రంథంలో అనుబంధాలనూ తెలుపబడింది. జన్మనిచ్చిన తల్లి తండ్రిపట్ల కుమారులకు, గల బాధ్యత అన్నదమ్ములకు, భార్యాభర్తలకు ఉండవలసిన అనుబంధాలనూ ఇంకా పాలితులకు, ప్రజలకు గల సంబంధాలను శ్రీ రామచంద్రుని వ్యక్తిత్వం, యావత్ మానవాళికి మార్గ నిర్దేశంగా, రామాయణంలో చూపినంత గొప్పగా మరే గ్రంథంలో చూపలేదంటారు. సమర్థవంతంగా పాలకులు నడిపిన రాజ్యాన్ని, రామరాజ్యంగా అభివర్ణిస్తూ ఉంటారు. నేడు కలియుగంలో మానవ సంబంధాల మృగ్యమైన నేపథ్యం. నేటి సమాజంలో అనుబంధాలకు తావులేదు. ఇక పాలకులకు అధికారం చేజిక్కితే అంతటా అవినీతి, బంధుప్రీతి, అక్రమాలు, ప్రజా శ్రేయస్సు కాంక్షించే పాలకులు కనపడరు. సమాజములో అధికారం కోసం కన్నతండ్రిని సైతం మట్టుపెట్టే కుసంస్కృతి. సభ్య సమాజం తలదించుకునే విధముగా నేటికీ స్త్రీని వినోద, విలాస వస్తువుగా భావించే నైజం. ఇక ప్రకృతి సిద్ధంగా లభించిన పంచభూతాలైన భూమి, నీరు, అగ్ని, గాలి, ఆకాశం సృష్టిలో జన్మించిన సకల జీవులకు పంచభూతాలపై అనుభవించే అధికారం, ఆధారం అన్న మాటను మరిచిపోయిన మానవుడు. సకల జీవ రాశులకు ఈ చరాచర సృష్టిలో భాగం ఉందన్న జ్ఞానానికి తిలోదకాలు, స్వస్తి చెప్పిన మానవాళి. ఆధునీకరణ పేరుతొ నదులు, సముద్ర జలాల్ని, భూమి పాతాళ అంచుల వరకు త్రవ్వుకుంటూ అడవులను నరుకుతూ పోతూ, వాటి స్థానములో ఆకాశ హర్మ్యాలు, కాంక్రీట్ బిల్డింగ్లు, ఎక్కడ చూసినా ఆకాశాన్ని అంటే సెల్ టవర్లు, వికృతకేళికి పరాకాష్టగా, బక్షకులకు బోజ్యంగా జంతువులను చంపి ఆహారముగా భుజించటం, ఇంకా సృష్టి వినాశనానికి అనేకానేక క్రొత్త పుంతలు తొక్కుతూ, చంద్ర మండలానికి సైతం రహదారి వేస్తూ, మానవుడు అన్నీ తానే, అంతా నేనే అనే ఆధిపత్యముతో స్వార్థంతో ఉంటే ఇక పశు పాక్ష్యాదులకు జీవించే స్థావరం ఏది? ఈ విధంగా పర్యావరణం మొత్తం కబళించివేస్తున్న వైనం. రోజు రోజుకు దిగజారి సమాజంలో మనిషి మనుగడ నడుస్తున్న తీరు, ఈ దుస్థితికి కారణమేమో అని సర్వత్రా ఆందోళనకరం. రెండు సంవత్సరాలుగా కరోనా మహమ్మారి ప్రపంచ వ్యాప్తంగా స్వైర విహారము చేస్తూ జన జీవితాల్ని అస్తవ్యస్తం చేస్తోంది అన్న విషయాన్ని ఈ ఆధునిక మానవుడు గ్రహించాలి. రామా మేం చేసిన తప్పిదాలను మన్నించి, కరుణించు శ్రీరామా, శ్రీరామ నవమి శుభవేళ... మా మొర ఆలకించి ఆనాడు రాక్షస సంహారం చేసిన చందాన ఈ భువిపై నేడు కరాళ నృత్యం చేస్తోన్న ''కరోనా మహమ్మారినీ'' అంతంచేయమని శ్రీరామచంద్రునికి ''మము బ్రోవమనీ చెప్పవే'' సీతమ్మ తల్లి.

**''శ్రీరామనవమి'' హిందువులకు ఒక ముఖ్యమైన పండుగ:**

శ్రీరాముడు త్రేతాయుగంలో వసంతఋతువు, చైత్రమాసం, శుక్ల పక్షం, శుద్ధ నవమి, గురువారము నాడు పునర్వసు నక్షత్రపు కర్కాటక లగ్నం సరిగ్గా అభిజిత్ ముహూర్తంలో అంటే మధ్యాహ్నం 12 గంటల వేళలో జన్మించిన శుభసందర్భాన్ని పురస్కరించుకుని, ఆ మహనీయుని జన్మదినమును ప్రజలు శ్రీరామనవమి పండుగగా జరుపుకుంటారు. శ్రీరాముడు పితృవాక్యమును పాటించుట కొరకై, పదునాలుగు సంవత్సరములు అరణ్యవాసము, రావణ సంహారము తరువాత శ్రీరాముడు సీతాసమేతంగా అయోధ్యలో పట్టాభిషిక్తుడైనాడు. ఈ శుభ సంఘటన కూడా చైత్ర శుద్ధ నవమి నాడే జరిగినదని ప్రజల విశ్వాసము. ''శ్రీరామనవమి'' సాధారణంగా సీతారామకళ్యాణం చూసేందుకు భద్రాద్రికి వెళ్ళడానికి అందరికి సాధ్యపడని విషయం విదితమే. ఎవరికీ వారు ఆనవాయితీ ప్రామాణికముగా శ్రీ సీతారాముల కళ్యాణం జరుపుకోవడానికి ముందుగా ఇంటిల్లిపాది తలంటుకుని పట్టు వస్త్రాలు ధరించడం గుమ్మాలను మామిడి తోరణాలతో అలంకరించి, వాకిటముందు రంగు రంగు ముగ్గులతో అలంకరించి, భద్రాద్రిలో జరుగుతున్న శ్రీ సీతారాముల కళ్యాణం రేడియోలో వింటూ కొందరూ, టి.వి.లలో తిలకిస్తూ ఇంకొందరు శ్రీ సీతారాముల కళ్యాణం జరుపుకొంటారు. లేదా వీధీ వీధీలో ఉన్న దేవాలయాలు శ్రీ సీతారాముల కళ్యాణ ఉత్సవాలను వారం రోజుల పాటు నిర్వహించేందుకు ఆలయాలను పందిళ్ళు వేసి, పువ్వులతోనూ, మామిడి తోరణాలతో, విద్యుత్ దీపాలంకరణతోనూ, సర్వంగా సుందరంగా అలంకరించి కళ్యాణ వేడుకలు ఘనంగా జరుపుతుంటారు.

**శ్రీ సీతారాముల కళ్యాణం:**

శ్రీ సీతారాముల కళ్యాణం కూడా ఈ చైత్ర శుద్ధ నవమి నాడు జరిగినట్లుగాను, ఆ రోజునే సీతారామ కళ్యాణ మహోత్సవంగా నిర్వహించడం సంప్రదాయంగా, తెలంగాణాలోగల భద్రాచలమందు సీతారామకళ్యాణ ఉత్సవాన్ని వైభవోపేతంగా జరుపుతారు. జీలకర్ర బెల్లం మంగళసూత్రం కట్టడం, తలంబ్రాలు... ఈసాంప్రదాయం ఈనాటి తెలుగింట జరిగే వివాహంలాగానే శ్రీ సీతారాముల కళ్యాణం జరుగుతుంది. ఆ సీతారామకళ్యాణంతో లోకమంతా సుభిక్షంగా ఉంటుందని ప్రతీతి. ఆ రోజున జరిపే సీతారామ కళ్యాణం కనులార చూసి తరించాలని లక్షలాదిగా ప్రజలు ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణ ప్రాంతాలవారే కాకుండా దేశ విదేశాలనుండి తరలి వస్తుంటారు. కొంగు బంగారమై, వరాలిచ్చే విశ్వాసంతోనూ, వైభవోపేతంగా జరిపే ఉత్సవంలో పాల్గొనాలనీ, ఉబలాటపడుతుంటారు తెలంగాణా ముఖ్యమంత్రి అధికారికంగా సీతారాములకు నూతన వస్త్రాలతో, ముత్యాల తలంబ్రాలను తలమీద పెట్టుకుని తీసుకునివస్తారు. సాంప్రదాయాల సారంగా తదుపరి నైవైద్యంగా బెల్లం కలిపిన పానకం, అందులో మిరియాలు, జీలకర్ర, యాలుకులు కలుపుతుంటారు. ఇంకా చలువ కలిగేందుకు, బెల్లంతో కలిపిన చలిమిడి మరియు పెసర వడపప్పు నైవైద్యంగా సమర్పించిన అనంతరం కళ్యాణానికి వచ్చిన భక్తులకు ప్రసాదంగా అందిస్తారు. వీటిని భక్తులు సేవించడం ద్వారా వీటిలో నిక్షిప్తమై ఉన్న ఔషధ గుణాలు శరీరానికి ఎంతో మేలు చేస్తాయంటారు ఆయుర్వేద వైద్య నిపుణులు.

**రామ జన్మభూమి :**

అయోధ్య రామ జన్మభూమి, రాముని దేవాలయ నిర్మాణ పనులు జరుగుతున్న నేపథ్యం. నేటి భారతదేశం యావత్తు గృహంలోనే ఉండి శ్రీరామచంద్రుడుని పూజాదికాలు జరుపుకోవలసిన పరిస్థితి. ఈ ప్లవ నామ సంవత్సరాన హిందువులైన ప్రతి ఒక్కరి ఇంటిలో కళ్యాణం జరుపుకోవడానికే, కావచ్చును, భగవంతుని లీలలు ఊహించతరమా? నేడు ప్రపంచ వ్యాప్తంగా సంభవించిన (కరోనా) విపత్తునూ ఎదుర్కొని అందరూ సురక్షితులూ కాగలిగే విధంగా శ్రీరామచంద్రమూర్తిని భక్తిప్రపత్తులతో సేవించండి. కోట్లాది భక్తులు ప్రతి యేటా దేశ విదేశాల నుండి కదిలివెళ్ళి భద్రాద్రి సీతారాముల కళ్యాణం చూడలేక పోతున్నామనీ, తిలకించి తరించే అవకాశం లేనందుకు చింతించకండి. ప్రపంచంలో ఉన్న హిందువులు, ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల వారు ప్రతి ఇంటిలోనూ భార్యాభర్తలు పీటలమీద ఆశీనులై భద్రాద్రిలో జరుగు సీతా రాముల కళ్యాణం (రేడియా మరియు టీవీల్లో జరుగుతున్నట్టి ప్రత్యక్ష ప్రసారాన్ని వీక్షిస్తూ, అనుసరిస్తూ) రాములోరి కళ్యాణం జరిపించుకునేందుకేనని అర్థం చేసుకుని, సిద్ధంకండి.

**శ్లో॥ శ్రీ రాఘవం దశరధాత్మజ మప్రమేయం,**
**సీతాపతిం రఘుకులాన్మయ రత్నదీపం !**
**ఆజానుబాహు మరవింద దళాయతాక్షం,**
**రామం నిశాచర వినాశకరం నమామి!**
**శ్లో॥ ఆపదా మప హర్తారం దాతారం సర్వసంపదాం,**
**లోకాభిరామం శ్రీరామం భూయో భూయో నమామ్యహం.**
**సర్వేజనః సుఖినో భవంతు.**

## సకలగుణసంపన్నుడు

మన ఆరాధ్య దైవం
శ్రీ రామచంద్రుడంటే

రఘువంశ రాజకుమారుడు
క్రమశిక్షణ గలవాడు
ధనుర్విద్యలో ఆరితేరినవాడు
ఒకే మాట ఒకే బాణం
ఒకే భార్యగల ఏకపత్నీ వ్రతుడు

సకల గుణసంపన్నుడు
ప్రశాంత చిత్తం గలవాడు
సాహసికుడు సమర్థుడు
సత్యవాక్య పరిపాలకుడు

నిత్యంసత్యాన్ని పలికేవాడు
నీతిమంతుడు దూరదృష్టి
దృఢమైన సంకల్పం కలిగిన
ధర్మాత్ముడు ధైర్యవంతుడు

సమస్త కార్యాలలోను సమర్థుడు
సర్వజీవుల పట్ల దయకలిగినవాడు
సకల ప్రాణుల శ్రేయస్సును కోరువాడు
ఘనచరిత్రగల ఘనుడు త్యాగధనుడు
దయ జాలి ప్రేమగల దశరథ నందనుడు

కోటిసూర్యులతేజస్సు కలిగినవాడు
ఎదుటివారిలో మంచినే చూసేవాడు
సమస్తలోకాల్లోనూ సాటిలేని వీరుడు

సమస్యలను చిరునవ్వుతో స్వీకరించే
సుందరరూపుడు ఈ అందాలరాముడు
ఆందోళనచెందని స్థితప్రజ్ఞుడు అసూయ
ఆవేశ మెరుగని ఈ అయోధ్య రాముడు

దేవతలకు కూడా భయాన్ని కలిగించే ధీశాలి
రాక్షసుడైన రావణాసురున్ని సంహరించినవాడు
క్రోధాన్ని కోపాన్ని ఇంద్రియాలను జయించినవాడు

అట్టి పురుషోత్తమున్ని మన పాలకులంతా
ఆదర్శంగా తీసుకుంటే వచ్చేది రామరాజ్యమే కాదా!
ప్రజాస్వామ్యంలోప్రజలంతా సుఖశాంతులతో జీవించరా?
ధర్మం ధరణిలో దద్దరిల్లదా? ప్రగతి దేశాన ప్రజ్వరిల్లదా?



-పోలయ్య కూకట్లపల్లి
9110784502

# లాక్ డౌన్ తోనే కరోనా కట్టడి..

మహబూబ్నగర్, ఏప్రిల్ 20 ప్రపంచ దేశాన్ని రాష్ట్రాలను అతలాకుతలం చేస్తున్న కరోనా కేసులు తగ్గాలంటే తెలంగాణ రాష్ట్రంలో లాక్ డౌన్ తప్పనిసరిగా ఏర్పాటు చేస్తేనే బాగుంటుందని ప్రజలు ముక్త కంఠంతో కోరుతున్నారు. మొదటి దశ కరోనా కన్నా రెండో దశ అతి భయంకరంగా ఉందని ప్రజలు అంటున్నారు. ఎప్పుడు ఏమౌతుందోనని ప్రజలు బిక్కుబిక్కుమంటున్నారు. చాలామంది మాస్కులు ధరించడం లేదు.. కిరాణా షాపులో భౌతిక దూరం పాటించడం లేదు. అధికారులు ఎంత చెప్పినా కూడా ప్రజలు ఏమాత్రం పట్టించుకోకుండా ఇష్టమొచ్చిన రీతిలో వ్యవహరిస్తున్నారు. రోజురోజుకు చాపకింద నీరులా కరోనా కేసులు పెరుగుతూనే ఉన్నాయి. ప్రభుత్వ ఆస్పత్రిలో కూడా ప్రతి ఒక్కరికీ వైద్య సిబ్బంది కరోనా టెస్టులు నిర్వహించి వ్యాక్సిన్ ఇస్తున్నారని చెప్పారు. గతంలో మాదిరిగా ఈసారి కూడా ప్రభుత్వం కర్ఫ్యూ పెట్టేకన్నా లాక్ డౌన్ పెడితే బాగుంటుందని ప్రజలు కోరుతున్నారు. లాక్ డౌన్ ఏర్పాటు చేస్తే కరోనా కట్టడి చేయవచ్చని ప్రజలు అంటున్నారు.

అధికారులు స్పందించాలి..

రోజురోజుకు పెరుగుతున్న కరోనా కేసులు తగ్గాలంటే లాక్ డౌన్ ఏర్పాటు చేసేందుకు అధికారులు ప్రజాప్రతినిధులు స్పందించాలని పట్టణానికి చెందిన కొండా వీర రెడ్డి అన్నారు. గత సంవత్సరం కన్నా ఈ సంవత్సరం కరోనా కేసులు విజృంభిస్తున్నాయని ఆయన అన్నారు. ఇవి పూర్తిగా తగ్గుముఖం పట్టాలంటే లాక్ డౌన్ తప్పనిసరని అలాగే ప్రతి ఒక్కరు కూడా మాస్క్ ధరించాలని ఆయన కోరారు.

# అభివృద్ధిపై చర్చకు సిద్ధమా..

మహబూబ్నగర్, ఏప్రిల్ 20: మున్సిపాలిటీ అభివృద్ధిపై పోలీస్ స్టేషన్ వేదికగా చర్చకు సిద్ధమా అని కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు వార్ల విజయ్ కుమార్ టీఆర్ఎస్ నాయకుల నుద్దేశించి అన్నారు. ఆయన నివాసంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ కొడంగల్ ఎమ్మెల్యే నరేందర్ రెడ్డి కాంగ్రెస్ కార్యకర్తలను ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలను ఖండించారు. గతంలో తాము చర్చకు సిద్ధమైనప్పటికీ అక్రమంగా అరెస్టు చేశారని, తాము మున్సిపాలిటీ అభివృద్ధిపై ముమ్మాటికి చర్చకు సిద్ధమేనని అన్నారు. ఎమ్మెల్యే నరేందర్ రెడ్డి, వస్తారా లేదా తమ కార్యకర్తలను పంపిస్తారో చెప్పాలన్నారు. కాంగ్రెస్ ఎంపీ, కొడంగల్ నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే రేవంత్ రెడ్డి హయాంలోనే మున్సిపాలిటీ అభివృద్ధికై నిధులు తీసుకువచ్చారని, దానిని ప్రస్తుతం అధికారంలో ఉన్న టీఆర్ఎస్ తాము నిధులను తీసుకువచ్చి అభివృద్ధి చేశామని చెప్పుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. గత నాలుగు సంవత్సరాల నుండి ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణంలోనే ఉందని, కోస్గి ప్రభుత్వ ఆసుపత్రికి రోజు వందల మంది వస్తుంటారని, ప్రభుత్వ ఆస్పత్రి నిర్మాణం పూర్తి చేయకపోవడం టిఆర్ఎస్ పాలనకు నిదర్శనమన్నారు. టిఆర్ఎస్ నాయకులకు అభివృద్ధిపై చిత్తశుద్ధి ఉన్నట్లయితే తాము తెచ్చిన నిధులపై ప్రొసీడింగ్స్ చూపించాలని అన్నారు. మున్సిపల్ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ 15కోట్ల రూపాయలతో మున్సిపల్ ను అభివృద్ధి చేశామని చెప్పుకుంటున్న ఎమ్మెల్యే 15 కోట్లు ఎక్కడ నుండి వచ్చాయో చెప్పాలన్నారు. రేవంత్ రెడ్డి కొడంగల్ కు ఎమ్మెల్యే గా ఉన్నప్పుడే మున్సిపల్ అభివృద్ధికై 15 కోట్ల రూపాయలు కోరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు ఇద్రీస్, భాను నాయక్, కాంగ్రెస్ నాయకులు రఘు వర్ధన్ రెడ్డి, ప్రభాకర్ , బె జూ రాములు, తుడుం శీను, శ్రీనివాస్ రెడ్డి, ఆసిఫ్, నాగులపల్లి సురేష్, రేవంత్ సైన్యం నరసింహ, నర్సింహులు తో పాటు తదితరులు ఉన్నారు.

# మంచినీరు కలుషితం కాకుండా చర్యలు..



ఆదిలాబాద్, ఏప్రిల్ 20: గతకొంతకాలంగా కార్పోరేషన్ పరిధిలోని పలు డివిజన్లలో కలుషిత నీరు సరఫరా అవుతుందనే అపోహలు ఉండడంతో ప్రజలు రోగాల పాలవుతున్నారని, ప్రజల ఆరోగ్యం కోసం మంచినీరు కలుషితం కాకుండా చర్యలు తీసుకుంటున్నట్లు కార్పోరేటర్ బదావత్ శంకర్నాయక్ తెలిపారు. 15వ డివిజన్లో మున్సిపల్ సిబ్బందితో కలిసి నీటి శాంపిల్స్ను సేకరించి పరీక్షలు చేయించారు. ప్రజారోగ్యం కోసం ఎమ్మెల్యే చందర్, మేయర్ అనిల్లు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారన్నారు. కరోనా పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, మాస్కులు ధరించి, భౌతిక దూరం పాటించాలని కోరారు.

# సామాజిక సేవలో ముందుంటాం..




కరీంనగర్, ఏప్రిల్ 20: సామాజిక సేవలో తాము ముందుంటామని దాసరి యువసేన వ్యవస్థాపక అధ్యక్షులు అల్లం వినోద్రెడ్డి పేర్కొన్నారు. ఆయన కుమారుడు అల్లం వినయ్రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని స్ఫూర్తి మానసిక వికలాంగుల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి మానసిక వికలాంగులకు స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం వికలాంగులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువసేన ద్వారా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, రానున్న రోజుల్లో సేవలను మరింత విస్తృతపరిచి నిరుపేదలకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

# మే 1 నుంచి వేగంగా సరళీకృతంగా కోవిడ్-19 మూడవ దశ టీకాల కార్యక్రమం

హైదరాబాద్, ఏప్రిల్ 20:దేశంలో 18 ఏళ్లు పైబడిన ప్రతి ఒక్కరికీ టీకాలు వేయడానికి అనుమతించాలని ప్రధానమంత్రి శ్రీ నరేంద్రమోదీ అధ్యక్షతన ఈ రోజు జరిగిన ఉన్నతస్థాయి సమావేశం నిర్ణయించింది. సాధ్యమైనంత త్వరగా అత్యధిక సంఖ్యలో భారతీయులకు వాక్సిన్ ఇచేలా గత సంవత్సరకాలంగా ప్రభుత్వం తీవ్రంగా కృషి చేస్తున్నాడని ప్రధానమంత్రి తెలిపారు. ప్రపంచంలో అత్యంత వేగంగా భారతదేశంలో టీకాల కార్యక్రమం అమలు జరుగుతున్నదని, ఇకపై కూడా మరింత వేగంగా ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తామని ప్రధానమంత్రి ప్రకటించారు.

దేశంలో టీకాల కార్యక్రమాన్ని అమలు చేయడానికి జాతీయస్థాయిలో ప్రభుత్వం కొవిడ్-19 టీకాల వ్యూహాన్ని 2020 ఏప్రిల్ నుంచి ప్రణాళికాబద్ధంగా, పరిశోధన, ఉత్పత్తి, సరఫరా అంశాలను సమన్వయం చేస్తూ అమలు చేస్తోంది. ప్రపంచంలో అతి పెద్ద టీకాల కార్యక్రమాన్ని ఎటువంటి సమస్యలు లేకుండా పెద్దఎత్తున వేగంగా అమలు చేయడానికి సుస్థిర కార్యక్రమాన్ని అమలు చేయడం జరుగుతోంది.

ప్రపంచంలో అమలులో ఉన్న ఉత్తమ విధానాలు, ప్రపంచ ఆరోగ్య సంస్థ జారీచేసిన మార్గదర్శకాలు, అంటువ్యాధులను అరికట్టడానికి ఉపకరించే విధానాల ఆధారంగా జాతీయ స్థాయిలో నిపుణులు సభ్యులుగా ఏర్పాటైన బృందం పర్యవేక్షణలో కొవిడ్-19 టీకాల కార్యక్రమం అమలు జరుగుతోంది.

వాక్సిన్ ల లభ్యత, ప్రాధాన్యతా వర్గాలకు టీకాలు వేసిన తరువాత మిగిలిన వారికి టీకాలను ఇవ్వాలన్న అంశాలపై ప్రభుత్వం సమగ్ర విధానాన్ని అనుసరిస్తోంది. ఏప్రిల్ 30వ తేదీ నాటికి వ్యాధి బారిన పడే అవకాశం వున్న వర్గాల్లో ఎక్కువ మందికి టీకాలను వేసే కార్యక్రమం పూర్తవుతుంది.

జాతీయ కోవిడ్-19 వ్యూహం మొదటి దశ దేశంలో 2021 జనవరి 16వ తేదీన ప్రారంభమయింది. దీనిలో హెల్త్ కేర్ వర్కర్లు (హెచ్సిడబ్ల్యు) మరియు ఫ్రంట్ లైన్ వర్కర్ల (ఎఫ్ఎల్డబ్ల్యు) ను ప్రాధాన్యతా వర్గాలుగా గుర్తించి వీరికి రక్షణ కల్పించడానికి టీకాలను ఇచ్చారు. ఈ దశ విజయవంతం కావడంతో రెండో దశ టీకాల కార్యక్రమాన్ని 2021 మార్చి ఒకటవ తేదీన ప్రారంభించారు. దీనిలో వ్యాధి బారినపడే ప్రమాదం వున్న 45 ఏళ్లు పైబడిన వారికి టీకాలను ఇవ్వడం ప్రారంభించారు. ఈ వయస్సు వున్నవారు కొవిడ్ బారిన ఎక్కువగా పడుతున్నారు. దేశంలో 80% కోవిడ్ మరణాలు ఈ వయస్సులో వున్నవారికి సంభవిస్తున్నాయని గుర్తించారు. ఈ దశలో సామర్థ్యాన్ని పెంపొందించుకోవడానికి ప్రైవేట్ రంగ సహకారాన్ని కూడా తీసుకోవడం జరిగింది.

ప్రధానమంత్రి ఆదేశాల మేరకు సంబంధిత వర్గాలు, ఉత్పత్తిదారులు, పరిశోధనాసంస్థలు, నియంత్రణదారుల మధ్య సమన్వయం సాధించడం జరిగింది. ప్రైవేట్ రంగంలో వాక్సిన్ ఉత్పత్తిని ఎక్కువ చేయడానికి ప్రభుత్వ-ప్రైవేట్ భాగస్వామ్యం, విప్లవాత్మక నిర్ణయాలు, పరిశోధనలు, పరీక్షలు లాంటి అంశాల ద్వారా చర్యలు అమలు చేస్తూ దేశంలో అమలులో వున్న నియంత్రణ విధానాల ద్వారా టీకాల లక్ష్యాన్ని సాధించడానికి సమగ్ర వ్యూహం అమలు జరుగుతోంది. ప్రధానమంత్రి ఆదేశాల మేరకు ఉత్పత్తిదారులతో ప్రభుత్వం ఎప్పటికప్పుడు చర్చలు జరుపుతూ, అవసరమైన నిధులను గ్రాంటులు, అడ్వాన్సుల రూపంలో అందిస్తూ ఉత్పత్తిని పెంపొందించడానికి కృషి చేసి విజయం సాధించింది.

దీని ఫలితంగా రెండు దేశీయంగా తయారైన వ్యాక్సిన్లకు (సీరం ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇండియా మరియు భారత్ బయోటెక్) అత్యవసర వినియోగ అనుమతులు జారీ అయ్యాయి. ప్రస్తుతం విదేశాలలో తయారవుతున్న మూడవ వ్యాక్సిన్ (స్పుత్నిక్) త్వరలో భారతదేశంలో ఉత్పత్తి చేయబడుతుంది. టీకాల కార్యక్రమంలో తొలుత నుంచి కేంద్ర ప్రభుత్వం ప్రైవేట్ రంగ సహకారాన్ని తీసుకొంటున్నది. వ్యవస్థలు, ప్రక్రియలు సుస్థిరత సాధించడంతో ఉత్పత్తిని మరింత ఎక్కువ చేయడానికి ప్రభుత్వ ప్రైవేట్ రంగ సంస్థలు సిద్ధంగా వున్నాయి.

మూడవ దశ టీకాల కార్యక్రమాన్ని మరింత సరళంగా వేగంగా అమలు చేయాలని నిర్ణయించారు. టీకాలను ఎక్కువమందికి అందుబాటులోకి తేవడం, ధర అంశాలపై దృష్టి సారించడం జరిగింది. దీనివల్ల వాక్సిన్ ఉత్పత్తి ఎక్కువ కావడమే కాకుండా లభ్యత కూడా పెరుగుతుంది. జాతీయ అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన సంస్థలు ఉత్పత్తి రంగంలోకి ప్రవేశించడానికి వీలు కలుగుతుంది. ధరల నిర్ణయం, సేకరణ అర్హత, టీకాలను ఇచ్చే కార్యక్రమం స్థానిక అవసరాలు, పరిస్థితులకు అనుగుణంగా జరిగే విధంగా మూడవ దశను రూపొందించడం జరిగింది.

# మల్లాపూర్ కుర్చీల తయారీ సంస్థలో అగ్ని ప్రమాదం..

హైదరాబాద్, ఏప్రిల్ 20:మేడ్చల్ జిల్లా మల్లాపూర్ పారిశ్రామిక వాడలో ఈ ఉదయం భారీ అగ్నిప్రమాదం సంభవించింది. కుర్చీల తయారీ పరిశ్రమలో భారీగా మంటలు చెలరేగాయి. మంటలు భారీగా ఎగిసిపడి పక్కనున్న రసాయన పరిశ్రమలకు వ్యాపించాయి. మంటలు చెలరేగడంతో పరిశ్రమ నుంచి కార్మికులు బయటకు పరుగులు తీశారు. సంఘటనా స్థలికి అగ్నిమాపక సిబ్బంది చేరుకొని మంటలను అదుపు చేశారు..సకాలంలో మంటలను అదుపు చేయడంతో భారీ ప్రమాదం తప్పింది?

# సఫాయి కార్మికుల సమస్యలు




మహబూబ్నగర్, ఏప్రిల్ 20: వనపర్తి జిల్లాలోని 14 మండలాల్లో 255 గ్రామపంచాయతీలో పని చేస్తున్న సఫాయి కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎస్సి ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యులు మిషేక్ చర్మకార జాతీయ అధ్యక్షుడు వెంకటేష్ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా 16 పీఆర్సీ ప్రకారం కనీస వేతనం 19 వేల నుండి క్యాటగిరి ప్రకారం 30 వేలు ఇవ్వాలని, 30 ఏళ్ళ నుండి పని చేస్తున్న కార్మికులను పర్మినెంట్ చేయాలని కోరారు. అలాగే ప్రతి కార్మికునికి డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు కట్టించి ఇవ్వాలని వారికి ఈఎస్ఇ. పీఎఫ్ వర్తింపజేయాలని కోరారు. సఫాయి కార్మికుడు పని చేస్తూ చనిపోతే వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని..ఎస్సి ఎస్టీ సబ్ ప్లాన్ ద్వారా లేదా ఎస్సి కార్పొరేషన్ ద్వారా కార్మికుల కుటుంబాలకు రుణ సదుపాయం కల్పించాలని కోరారు. పని చేస్తూ చనిపోయిన కార్మికునికి తక్షణ సాయం అందించాలని వినతి ద్వారా కోరారు.

# 3 రోజులు తెలంగాణాలో అక్కడక్కడ వర్షాలు..

హైదరాబాద్, ఏప్రిల్ 20: జార్ఖండ్ నుంచి ఉత్తర కర్ణాటక వరకు ఉపరితల ద్రోణి బలహీనపడింది. నైరుతి మధ్యప్రదేశ్ నుంచి ఉత్తర కర్ణాటక వరకు ద్రోణి కొనసాగుతోంది. సముద్ర మట్టానికి 1.5 కిలోమీటర్ల ఎత్తున ఉపరితల ద్రోణి ఏర్పడింది. ఈ క్రమంలో రాగల మూడు రోజుల్లో రాష్ట్రంలో తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు. ఒకట్రెండు చోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కూడా కురిసే అవకాశం ఉంది. రాగల మూడు రోజుల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు, సాధారణ ఉష్ణోగ్రతల కన్నా 2 నుండి 3 డిగ్రీల సెల్సియస్ పెరిగే అవకాశాలు ఉన్నాయని కూడా తెలిపారు.

# ధర్మస్వరూప సీతారామ కళ్యాణం

శ్రీరామచంద్రుని అవతారము మహోన్నతమైనది! త్రేతాయుగం నుండి కలియుగంలో భారతీయుల దృష్టిలో శ్రీరాముడు ఆదర్శ మూర్తిగా,మానవతా ధర్మాన్ని ప్రతిష్ఠించిన ఒక మహా పురుషుడుగా ప్రతి హృదయంలోను ఆరాధ్యుడై నిలువగలిగి ఆరాధింపబడుతున్నాడు.

చైత్ర మాసంలో పునర్వసు నక్షత్రంలో శుద్ధ నవమి నాడు కర్కాటక లగ్నంలో దశరథ కౌసల్య గర్భమున జగత్కల్యాణానికై జన్మించాడు. ఆ రోజే శ్రీరామనవమి, శ్రీరామచంద్రుని క్షేత్రాలలో అత్యంత వైశిష్ట్యం గల క్షేత్రం భద్రాచలం దివ్యక్షేత్రం. భద్రాద్రి, భద్రుడు (రాముడు) అచలుడు (కొండ) శ్రీరాముడు కొండపై నెలవున్న ఈ క్షేత్రం భద్రాచలంగా ప్రసిద్ధి చెందింది.

సద్గురూపదేశము చేతను, వేదాంత విచారణ వనలనను జీవాత్మ, పరమాత్మలకు భేదము లేదను అపరోక్ష జ్ఞానము జీవునకెపుడు కలుగునో అప్పుడే సర్వ సంసారమునకు కారణమైన అవిద్య తనచే కల్పితములైన కార్యములన్నిటితో కూడ పరమాత్మ యందు లయ మొందును. అట్టి అవిద్యాయ స్థితియే మోక్షమనబడును. అని శ్రీరామచంద్రుడు సోదరుడైన లక్ష్మణునికి హితోపదేశము చేసినాడు. శ్రీరాముడు ధర్మజ్ఞుడు. సత్యసంధుడు, ఆయన సత్యాన్ని, ధర్మాన్ని రక్షించాడు.మానవులంతా సమానమే అనే ఉన్నత ధర్మాన్ని తాను ఆచరించి, ఇతరులకు మార్గదర్శకుడైనాడు. లోకమున శాంతి భద్రతలు అందించే నిమిత్తం రామ తత్త్వం ఆవిర్భవించింది. ధర్మమే రామ స్వరూపం. కనుక ఆ శ్రీరామచంద్రుడు నడిచిన సత్యధర్మ మార్గాన్ని అనుసరించి, మానవ జీవితాన్ని సార్థకం చేసుకోవాలి.

సీతాదేవి మహా చైతన్యశక్తి, సృష్టి, స్థితి లయములకు కారణమగు తల్లి. శివధనుర్భంగం గావించిన శ్రీరాముని మెడలో వరమాల వేసి, రామ పత్నియై, అత్తామామల ప్రేమకు పాత్రురాలైన శిరోమణి. ప్రతి స్త్రీకి సీతాదేవి ఆదర్శం. హనుమంతుడు భక్తులకు, లక్ష్మణుడు సేవాతత్పరతకు, ఊర్మిళ, భరత, శత్రుఘ్నులు, కైకేయి త్యాగశీలతకు అనురాగానికి తార్కాణం.

రామాయణం వేద ధర్మమును బోధించుచున్నది. 'రామ' శబ్దం తత్ స్వరూపం. రాముడు ధర్మానికి రూపం. శ్రీరాముని పేరు వినినంతనే పితృవాక్య పరిపాలనా దక్షుడు, ఏక పత్నీవ్రతుడు, పరాక్రమవంతుడు, దుష్ట శిక్షకుడు, ధర్మరక్షకుడు అని ఏదో ఒక భావం ప్రతి మనిషిలోనూ స్ఫురిస్తుంది. అవతార పురుషుడుగా,

జన్మించిన శ్రీరాముడు సామాన్య మానవుడిలా ప్రవర్తించి, ధర్మానికి ప్రతీకగా నిలిచాడు కాబట్టి "రామో విగ్రహవాన్ ధర్మః" అన్నారు. మానవుడిని దేవుడుగా చేయటానికి మార్గం చూపిన మహత్తర అవతారం. అందుకే శ్రీరాముడు ఆరాధ్యుడు. సర్వధర్మ స్వరూపుడు. రామాయణం ఆదికావ్యం అన్ని కాలాలకూ ఆదర్శం.

'రామ' నామం సోమ సూర్యాగ్నులను మించిన స్వప్రకాశం,'ర' అక్షరం అగ్ని సంబంధమైనది. మనస్సులోని శుభ కర్మల యొక్క భావనలను నశింపచేసి, అద్వైతమును అవగాహనకు తెచ్చునది. 'అ' అక్షరం సూర్య సంబంధ బీజం అవిద్యను, అజ్ఞానమును హరించి, సర్వవేద సంబంధ జ్ఞానమునిస్తుంది. 'మ' కారం చంద్ర బీజం, అది దైవత, అది భౌతిక, ఆధ్యాత్మికములచే త్రివిధములైన తాపములను నశింపచేస్తుంది. త్రిమూర్తులు ఏకతా రూపమ్ 'రామ' శబ్దం సత్య గుణములతో కలసిన జ్ఞాన రూపం శ్రీరామచంద్రుడు.

శ్రీరాముడు మానవాకారం దాల్చిన భగవంతుడు, కానీ తాను ఎక్కడా భగవంతుడినని, సర్వశక్తి సమన్వితుడనని చెప్పుకోలేదు.. సామాన్య మానవుడిలా ఆయన యానం నడిచింది. కష్ట నష్టాలు, సుఖదుఃఖాలకు అతీతంగా మనిషి ఎలా ప్రవర్తించాలో మానవాళికి చాటి చెప్పాడు. మిగిలిన అవతారాల కన్నా రామావతారంలో వున్న విశిష్టత యిది. 'రామ' అనే రెండక్షరాలు మోక్షాన్ని ప్రసాదిస్తాయి. ఇష్ట కామ్యాన్ని అందిస్తాయి. సర్వ పాపాలు హరిస్తాయి.

శ్రీరాముడు పరిపూర్ణ మానవుడిగా ప్రవర్తించి, స్వధర్మమును వీడక, ధర్మ పథాన్ననుసరించి, లోకానికి ధర్మ మహాత్యమును చాటి చెప్పి, దైవ భక్తి, తల్లిదండ్రుల యందు సోదరుల యందు ప్రేమ, ధర్మ పరాయణత్వం, సత్య సౌహార్థత, వినయం, రక్షణ, దయ, సకల సద్గుణ సంపన్నత్వం, పరిపూర్ణంగా ప్రతిఫలించే సద్గుణ సాగరుడు శ్రీరాముడు. మానవుడు లోకంలో ఎలాంటి జీవిత విధా నాన్ని అనుసరిస్తే సుఖవంతమైన, ప్రశాంతమైన జీవితం లభిస్తుందో తన జీవన విధానం ద్వారా స్పష్టం చేశాడు. మానవుడు తమ వ్యక్తిగత జీవితాన్ని సమాజ సమగ్రాభివృద్ధికి అనుగుణంగా ఏ విధంగా 'మలచుకొనవలయునో చాటి చెప్పే ప్రవర్తనా నియమావళియే శ్రీరామ చరితము. వేటగాడి వేదన రామాయణమైంది. జనని వేదన జన్మకారణమైంది. వాల్మీకి రామాయణం అన్ని కాలాలకూ ఆదర్శమైంది.

భారతీయుల ఆరాధ్య దైవం శ్రీరామచంద్రుడు.భద్రాద్రిలోని

శ్రీరాముడు సీతాలక్ష్మణ సమేతుడై చతుర్భుజాలతో అపసవ్య శస్త్ర దారణతో, ఊర్ధ్వ కరాలలోని కుడిచేతిలో శంఖం, ఎడమ చేతిలో చక్రం, అధః కరాలతో ఎడమ చేతిలో ధనువు, కుడి చేతిలో అభయ ముద్రలతో కూడిన బాణం ధరించిన భద్రాద్రి రామునికి భారతదేశం లోని ఇరవై అయిదు రామక్షేత్రాలలో ఒక విశిష్టమైన ప్రత్యేకత వుంది. శ్రీ మహావిష్ణు స్వరూపుడుగానూ, త్రేతాయుగ దైవంగానూ పురాణాలు ఘోషిస్తున్నాయి. ద్వాపర యుగ దైవమైన శ్రీకృష్ణునికి కలియుగ దైవమైన శ్రీ వేంకటేశ్వరునికి ఉన్న ఆలయములకంటె శ్రీరామునికి ఎక్కువ ఆలయములు భారతావనిలో నిర్మించడమైనది. దీనిని బట్టి శ్రీరామచంద్రునిపై భారతీయులకు ఎంతటి భక్తి వున్నదో తెలుయుచున్నది.

శ్రీరాముడు సర్వోపాస్యదైవం, శ్రీరాముడే పరబ్రహ్మ, శ్రీరాముడే పరమతపము. ఆయనే తారక బ్రహ్మ. వేద వేద్యుడైన పరమాత్మ దశరథ మహారాజు



తనయునిగా చైత్ర శుద్ధ నవమి బుధవారం, పునర్వసు నక్షత్రయుక్త కర్కాటక లగ్నంలో శుభ ఘడియలలో అవతరించినట్లు రామాయణంలో తెలుపబడింది. కనుక చైత్ర శుద్ధ నవమినాడే దేశమంతటా రామజన్మదిన వేడుకలు, కళ్యాణ మహోత్సవాలు అత్యంత భక్తి శ్రద్ధలతో, ఉత్తర భారతంలో అయోధ్యలో, దక్షిణ భారతంలో ఘనంగా జరుపబడుతున్నాయి. శ్రీరాముని జన్మస్థలమైన అయోధ్యకి ఎంతటి ప్రాధాన్యత ఉన్నదో అంతటి ప్రాధాన్యత భద్రాచలమునకు ఉన్నదనుటలో అతిశయోక్తి లేదు.

జగత్కల్యాణ వైభవం ఒక్క భద్రాచలంలోనే సాకారం అవుతుంది. భద్రాద్రి శ్రీరామచంద్రుడు శ్రీవిలంబినామ సంవత్సరం చైత్రశుద్ధ నవమినాడు పునర్వసు నక్షత్రయుక్త కర్కాటక లగ్నంలో జన్మించాడని పేర్కొంటూ చైత్రశుద్ధ నవమినే శ్రీరామ నవమిగా భావిస్తూ, స్వామి పుట్టిన రోజునే కళ్యాణం జరిపించడం అనాదిగా, ఆనవాయితీగా వస్తోంది. పరమార్థమైన దాంపత్యానికి దివ్యత్వాన్ని ఆపాదించింది. సీతారాముల కళ్యాణమే! శ్రీరాముని జన్మదినము శిశిర ఋతువు. కాగా,సీతమ్మతో కళ్యాణము వసంత ఋతువున, గ్రీష్మఋతువున వనవాసము, వర్ష ఋతువున రాక్షసులతో యుద్ధములు జరిగాయని, శరదృతువునందు శ్రీరాముని రాజ్యపాలన సాగిందని పెద్దల వచనం.

"పూర్ణ మదః పూర్ణ మిదం పూర్ణాత్ పూర్ణముదచ్యతే పూర్ణస్య। పూర్ణ మాదాయ పూర్ణమ్ వావశిష్యతే" అని ఈశోపనిషత్తు. సంపూర్ణ జ్ఞానమ్ అవ్యక్తం, అవ్యక్తం కాని వస్తువును సాధనాపరంగా వ్యక్తతం చేసినదే రామాయణం.

శ్రీభూనీల, అది అను శక్తులకు కేంద్రం సీత మహా చైతన్య శక్తి, సృష్టి, స్థితి లయములకు కారణమగు తల్లి. శ్రీరామునికి సీత స్వయం వర కానుక పరమాత్మ, పరమ చైతన్య శక్తుల కలయిక సాధ్య సాధకముల చరితయే సీతారాముల కల్యాణం శ్రీరాముని వివాహం శాస్త్రోక్తం.

రఘువంశ కులదీపకుడైన శ్రీరామచంద్రమూర్తి భారతీయుల దృష్టిలో ఆదర్శమూర్తిగా, మానవతా ధర్మాన్ని ప్రతిష్ఠించిన ఒక మహా పురుషుడుగా ప్రతి హృదయంలోను ఆరాధ్యుడై నిలిచి ఆరాధింపబడుతున్న శ్రీరాముని జీవితం నేటి తరానికి ఆచరణీయం. ఏ ధర్మాన్ని రాముడు నియమంతో పాలించి ధర్మ స్వరూపుడైనాడో, ఆ ధర్మాన్ని మనమూ అనుసరిద్దాం. ఆచరిద్దాం. సీతారామ కళ్యాణం చూచి తరిద్దాం.



-రసస్రవంతి & కావ్యసుధ
9247313488,

## ఆ రూపం

క్రియాశీలతకు నిలువెత్తు రూపం
సహనశీలతకు వెలుగైన దీపం
జన హితమే తన మతమై
కరుణ,త్యాగం కనుచూపై నిలిచిన
ఆదర్శ భావనా దివ్య ప్రసూనం

రామ అనుపదమే చరితకు
నడతకు నిత్య ప్రభాతం
అనుబంధాలకు వారధిగా
నిలిచిన ఆత్మీయ సంస్కృతికి నిర్వచనం

ఆచరణ, ప్రవర్తన శృతిలయలై
విరిసిన ఆనంద భావనా జయ గీతం
మానవతామయ హృదయ కాంతిగా
జగతిన వెలసిన ధర్మ పథం

కష్టాలెన్నో చుట్టు ముట్టినా
చెదరని బెదరనిదృఢ చిత్తం
కారడవిన ఏళ్ళు గడిచినా
కరగని చెరగని సంకల్పం

శతాబ్దాల భరతావని ఘనతకు
గుణ సంపదగా నిలిచిన శాంతి స్వరూపం
యువతకు భవితకు స్వర్ణ రథంగా
కాంతులు అద్దే జీవన కలశం..



-వెల్మల జయపాల్ రెడ్డి
9441168976

## శ్రీ రామం నవ(మి)వేదం..!

శ్రీరామం ప్రణవనాదం
ఓంకార శబ్ద సమానం
సకల పాప హరణం
రఘునాథ సత్కీర్తనం
కష్టాల కడలిని దాటించే..
దివ్య రామనామ స్మరణం !

చెరలోనూ రామ స్మరణ చేసిన..
పరమపావని జగజ్జనని జానకి
లంక వైపు దూసుకెళ్లిన రామభాణం..
పరమభక్త శిఖామణి వీర హనుమ
అడవినే అయోధ్యగా భావించి..
అన్న సేవకే అంకితమైన లక్ష్మన్న !

కోదండరాముడి కీర్తన బలాన్ని..
జగతికి రుచి చూపిన వాల్మీకి

పాదుకలకే పట్టాభిషేకం చేసిన..
అద్వితీయ సోదరుడే భరతుడు
ఎంగిలి పండును రుచి చూపిన..
అనన్య భక్త శిరోమణి వన శబరి !

ఆత్మనివేదనంతో రాఘవుడినే..
కంట తడిపెట్టించిన జటాయువు
అవతార లక్ష్యానికి సహకరించి..
సీతాన్వేషణలో సాయపడ్డ సుగ్రీవుడు !
దుర్మార్గాన్ని నిర్ధ్వంగా వ్యతిరేకించి..
న్యాయ పక్షపాతి వివేక విభీషణుడు !

రామాయణంలో సజీవ పాత్రలు..
జీవన సన్మార్గానికే సాక్షాత్కారాలు

చిత్తయాగంలో హవిస్సులా..
కన్నీటి కష్టాలను దగ్ధం చేయాలని..
బోధించే మనసెరిగినవాడేగా రాముడు
జగదానంద కారణ పరంధాముడు !

సహస్రనామ తత్తుల్యం శ్రీరామం
కదలివచ్చే సజీవ ధర్మ నిలయం
పోతపోసిన ఆదర్శ మనోవికాసం
రూపుకట్టిన కారుణ్య రూపం
అనిర్వచనీయ ఆత్మానంద కేంద్రం
భవసాగరాన్ని దాటించే రామం నామం !



- డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

## కరోనా నివారణకు సహకరించండి..

మహబూబ్‌నగర్, ఏప్రిల్ 20: మండల పరిధిలోని పుల్గర్ చర్ల గ్రామంలో కరోనా సెకండ్ వేవ్ విస్తరిస్తూ ఉండటం వల్ల గ్రామ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సర్పంచ్ అరుణమ్మ, ఉప సర్పంచ్ బిజ్జ నరేష్ కుమార్ తెలిపారు. గ్రామంలో బ్లీచింగ్ పౌడర్ ను చల్లించారు. గ్రామ ప్రజలు ప్రతి ఒక్కరు మాస్క్ ధరించి భౌతిక దూరం, జాగ్రత్తలు పాటిస్తూ శానిటేషన్ వాడాలని సూచించారు. ప్రజలు నిర్లక్ష్యం విడకపోతే కరోనా మహమ్మారి బారిన పడాల్సి వస్తుందని అన్నారు. అత్యవసర సమయాల్లో మాత్రమే బయటకు రావాలని సూచించారు. దగ్గు ..జ్వరం వంటి లక్షణాలు కలిగి ఉంటే వెంటనే కరోనా నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు. గ్రామంలో 45 సంవత్సరాలు దాటిన ప్రతి ఒక్కరు కరోనా నివారణ వ్యాక్సిన్ తీసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో పారిశుధ్య కార్మికులు ,డ్రైవర్ కురుమయ్య,వాటర్ మెన్ ఆంజనేయులు,బాలస్వామి, వీ అర్ ఏ లు బిజ్జ పరమేష్, మొగులాలి, వెంకటేష్,ఏ ఎన్ ఎం రేణుక గ్రామ యువకులు పాల్గొన్నారు.

## కరోనా వైరస్ వ్యాప్తి నివారణ చర్యలలో భాగంగా రాత్రి పూట కర్ఫ్యూ : ఎస్పీ రాహుల్ హెగ్డే ఐపీఎస్

**-తెలంగాణా రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ఏప్రిల్ 30 వరకు నైట్ కర్ఫ్యూ**
**-వ్యాపార, వాణిజ్య సంస్థలు, ప్రజలు పోలీసు వారికి సహకరించాలి. పెట్రోల్ బంకులు,మీడియాకు మినహాయింపు**
**-జిల్లా ప్రజలందరూ తప్పనిసరిగా మాస్కులు ధరించి కరోనా వైరస్ కట్టడిలో పోలీసు వారికి సహకరించాలి.**
**-నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు**

రాజన్న సిరిసిల్ల , ఏప్రిల్ 20 (నేటినిజం ప్రతినిధి)::కరోనా ఉధృతి రోజు రోజుకు పెరుగుతున్న క్రమంలో ప్రభుత్వం విడుదల చేసిన ఉత్తర్వులకు అనుగుణంగా రాత్రి పూట కర్ఫ్యూ మంగళవారం నుండి అమలు చేస్తున్నట్లు జిల్లా ఎస్పీ తెలిపారు.కరోనా వైరస్ వ్యాప్తి నివారణ కొరకు రాత్రి పూట కర్ఫ్యూ విధించి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకోవడం జరిగిందని అన్నారు. అత్యవసర సర్వీసులు, పెట్రోల్ బంక్‌లు మరియు మీడియాకు కర్ఫ్యూ నుండి మినహాయింపు ఇచ్చినట్లు తెలిపారు.రాత్రి పూట 9-00 గంటల నుంచి ఉదయం 5-00 గంటల వరకు కర్ఫ్యూ అమలలో ఉంటుందని ఎస్పీ గారు ఈ సందర్భంగా తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించిన వారికి జరిమానాలతో పాటు కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రభుత్వ, ప్రయివేటు కార్యాలయాలు, సంస్థలు, వ్యాపార,వాణిజ్య సంస్థలు, కంపెనీలు, షాపింగ్‌మాల్స్ మరియు రెస్టారెంట్లను రాత్రి 8-00 లోగా మూసివేయాలని, రాత్రి 9-00 గంటల తర్వాత కర్ఫ్యూ పటిష్టంగా అమలు చేస్తామని తెలియజేసారు. కర్ఫ్యూసమయంలో మినహాయించబడిన ప్రభుత్వఉద్యోగులు, మెడికల్ సిబ్బంది, మీడియా ప్రతినిధులు విధిగా తప్పనిసరిగా ఐడీ కార్డులను తమతో కలిగి ఉండాలని కోరారు. అదే సమయంలో ఎయిర్‌పోర్టులు, రైల్వేస్టేషన్లు, బస్టాండ్లకు వెళ్లే ప్రయాణికులు వ్యాలిడ్ టికెట్లను తమ వద్దే ఉంచుకొని కర్ఫ్యూ సమయంలో వాటిని చూపించాల్సి ఉంటుందని, అంతర్ రాష్ట్ర సర్వీసులు,రాష్ట్ర సర్వీసులు యథావిధిగాకొనసాగుతాయని తెలిపారు.కరోనా కేసులు పెరుగుతున్న



క్రమంలో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి అనుగుణంగా ప్రజలు, వ్యాపార, వాణిజ్య సంస్థల నిర్వాహకులు, ఉద్యోగులు అన్ని వర్గాల వారు పోలీసు వారికి సహకరించి కరోనా వైరస్ వ్యాప్తి నివారణకు కలిసి రావాలని ఎస్పీ రాహుల్ హెగ్డే ఐపీఎస్ విజ్ఞప్తి చేశారు.

## దుబాయ్ శీను లఘు చిత్రం షూటింగ్ పూర్తి

రాజన్న సిరిసిల్ల , ఏప్రిల్ 20 (నేటినిజం ప్రతినిధి)::గల్ఫ్ ఏజెంట్ చేతిలో యువత మోనపోవద్దనే కథనంతో దుబాయ్ శీను అనే షార్ట్ ఫిల్మ్ మన సినిమా ముచ్చట్లు అనే యూట్యూబ్ లఘు చిత్రం షూటింగ్ వేములవాడ లో పూర్తి చేసుకుంది. దర్శక నిర్మాత ఆ ఛానల్ నిర్వాహకులు బండి శ్రీనివాస్ దర్శకత్వంలో ఈ చిత్రాన్ని ఏజెంట్ చేతిలో మోసపోతున్న యువత కోసం తీసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా బోండ్ల (బండి) శ్రీనివాస్ మాట్లాడుతూ ఉన్నత చదువులు చదువుకున్న యువకులు ఉపాధి కోసం గల్ఫ్ ఏజెంట్ చేతిలో మోసపోతున్నారని, వారి కోసమే ఈ లఘు చిత్రం రూపొందించామని పేర్కొన్నారు. మన సినిమా ముచ్చట్లు యూట్యూబ్ ఛానల్ లో ఇప్పటికే దాదాపు వందకు పైగా షార్ట్ ఫిల్మ్ లు చేసామని తెలిపారు. పలు విభిన్నమైన కథనాలతో యూట్యూబ్ ప్రేక్షకులను అలరిస్తున్నామని, ఎంతో మంది ప్రేక్షకులు తమ ఛానల్ ను ఆదరించారని హర్షం వ్యక్తం చేశారు. ఈ లఘు చిత్రం లో నటినటులు రజినీ, హనుమాన్, నవీన, రాకేష్, శ్రీకాంత్, సదానందం, లు నటించగా, కెమెరా,



ఎడిటింగ్ అరవింద్ చేస్తున్నారు. కథ మాటలు కరుణాకర్ అందిస్తున్నారు. నిర్మాత గా బోండ్ల విజయ ( బుజ్జక్క) వ్యవహరిస్తున్నారు.

## బొగ్గు గ్యాసిఫికేషన్ ద్వారా టాల్చర్ ఫెర్టిలైజర్స్ లిమిటెడ్ (టిఎఫ్ఎల్) ఉత్పత్తి చేసిన యూరియాకు ప్రత్యేకమైన సబ్సిడీ విధానాన్ని కేబినెట్ ఆమోదించింది.

హైదరాబాద్, ఏప్రిల్ 20: దేశంలోని విస్తారమైన బొగ్గు నిల్వలతో పాటు వ్యూహాత్మక ఇంధన భద్రత మరియు యూరియా స్వయం సమృద్ధిని పరిశీలించిన మేరకు.. బొగ్గు గ్యాసిఫికేషన్ టెక్నాలజీ ఆధారంగా టాల్చర్ ఫెర్టిలైజర్ లిమిటెడ్ ప్లాంట్‌తో ముందుకు సాగాలని నిర్ణయించారు. ఈ ప్రాజెక్ట్ రైతులకు ఎరువుల లభ్యతను మెరుగుపరుస్తుంది. తద్వారా తూర్పు ప్రాంత అభివృద్ధిని పెంచుతుంది మరియు దేశంలోని తూర్పు భాగంలో యూరియా సరఫరా కోసం రవాణా రాయితీని ఆదా చేస్తుంది. ఇది యూరియా దిగుమతులను సంవత్సరానికి 12.7 ఎల్ఎమ్‌టికి తగ్గించడంలో సహాయపడుతుంది. ఇది విదేశీ మారకద్రవ్యంలో పొదుపుకు దారితీస్తుంది.ఈ ప్రాజెక్ట్ 'మేక్ ఇన్ ఇండియా' చొరవ మరియు ఆత్మనిర్భర్ కార్యక్రమానికి ఊపునిస్తుంది. అలాగే రోడ్లు, రైల్వే నీరు మొదలైన మౌలిక సదుపాయాల అభివృద్ధికి సహాయపడుతుంది. సహాయక పరిశ్రమను ప్రోత్సహించడంతో సహా దేశంలోని తూర్పు భాగంలో ఆర్థిక వ్యవస్థకు తోడ్పాటును అందిస్తుంది. ప్రాజెక్ట్ యొక్క పరీవాహక ప్రాంతంలో సహాయక పరిశ్రమల రూపంలో కొత్త వ్యాపార అవకాశాన్ని కూడా ఈ ప్రాజెక్ట్ అందిస్తుంది.

బొగ్గు ధరలు అస్థిరత లేనివి మరియు బొగ్గు సమృద్ధిగా లభిస్తున్నందున బొగ్గు గ్యాసిఫికేషన్ ప్లాంట్లు వ్యూహాత్మకంగా ముఖ్యమైనవి. టాల్చర్ ప్లాంట్ యూరియా ఉత్పత్తికి ముఖ్యమైన సహజ వాయువుపై ఆధారపడటాన్ని కూడా తగ్గిస్తుంది. ఇది ఎల్ఎన్‌జి దిగుమతి బిల్లు తగ్గింపుకు దారితీస్తుంది. టాల్చర్ యూనిట్లో స్వీకరించబడిన గ్యాసిఫికేషన్ ప్రక్రియ క్లీన్ బొగ్గు సాంకేతిక పరిజ్ఞానం. ఇది బొగ్గు ఆధారిత ప్రక్రియలతో పోలిస్తే చాలా తక్కువ గాలీ, ఔలీ మరియు రేణువుల ఉద్గారాలను విడుదల చేసింది.

## హైదరాబాద్ మెట్రో రైలు సమయాల్లో స్వల్ప మార్పులు

హైదరాబాద్, ఏప్రిల్ 20:కరోనా మహమ్మారి ఉధృతిని నివారించే చర్యల్లో భాగంగా తెలంగాణ ప్రభుత్వం నేటి నుంచి రాత్రి కర్ఫ్యూ అమలు చేయనుంది. ఈ నేపథ్యంలో హైదరాబాద్ మెట్రో రైలు సమయాల్లో స్వల్ప మార్పులు చోటు చేసుకున్నాయి. చివరి స్టేషన్ నుంచి రాత్రి 7:45 గంటల వరకే చివరి మెట్రో రైలు అందుబాటులో ఉండనుంది. రాత్రి 8:45 గంటలకు చివరి స్టేషన్‌కు మెట్రో రైలు చేరుకోనుంది. ఈ మార్పులు నేటి నుంచి ఏప్రిల్ 30వ తేదీ వరకు అమల్లో ఉండనున్నాయి. ఉదయం 6:30 గంటల నుంచి మొదటి రైలు యథావిధిగా అందుబాటులో ఉండనుంది. ప్రయాణికులు మాస్కులు, శానిటైజర్లు వాడాలని మెట్రో అధికారులు సూచించారు.

## మావోయిస్టు నాయకుడు మారన్న లొంగుబాటు

విజయవాడ, ఏప్రిల్ 20: : ఆంధ్రా-ఒరిస్సా స్పెషల్ జోన్ కమిటీ సభ్యుడు ముత్తన్నగిరి జలంధర్ రెడ్డి అలియాస్ మారన్నా(40) పోలీసులకు లొంగిపోయినట్లు ఏపీ డీజీపీ గౌతమ్ సావాంగ్ తెలిపారు. డీజీపీ మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. పలు పోలీస్ స్టేషన్లపై దాడులకు పాల్పడిన మారన్న తలపై రూ.20 లక్షల రివార్డు ఉందన్నాడు. మారన్న తెలంగాణలోని సిద్దిపేట జిల్లాలోని కోపల్లికి చెందిన వ్యక్తి అని తెలిపారు. ఏవోబీలో అనేక దాడులకు పాల్పడటంతో పాటు 2008 బలిమెలా సంఘటనలో ప్రత్యక్షంగా పాల్గొన్నాడు. ఆరు హత్య కేసుల్లో నిందితుడు. పార్టీకి ప్రజల మద్దతు లేనందున మారన్న ప్రధాన స్రవంతిలో చేరాలని నిర్ణయించుకున్నట్లు సావాంగ్ పేర్కొన్నారు. లొంగిపోయిన మావోయిస్టులకు అందించే అన్ని సౌకర్యాలను రాష్ట్ర ప్రభుత్వం మరన్నకు వర్తింపజేస్తుందని డీజీపీ ఈ సందర్భంగా తెలిపారు.

## అమెరికా మాజీ ఉపాధ్యక్షుడు మోండలే కన్నుమూత



న్యూయార్క్, ఏప్రిల్ 20:: అమెరికా మాజీ ఉపాధ్యక్షుడు వాల్టర్ మోండలే (93) కన్నుమూశారు. వృద్ధాప్య సంబంధ అనారోగ్యంతోనే ఆయన మృతిచెందారని కుటుంబసభ్యులు చెబుతున్నారు. 'నా సమయం వచ్చేసింది. జోవాన్, ఎలీనార్‌ను కలిసేందుకు ఆసక్తిగా ఎదురుచూస్తున్నా' అని మోండలే గతంలో రాసిన లేఖను మరణం తర్వాత ఆయన సిబ్బంది విడుదల చేశారు. మోండలే భార్య జోవాన్ 2014లో మరణించగా, కుమార్తె ఎలీనార్ 51 ఏళ్ల వయసులో 2011లో మృతి చెందారు.

జిమ్మీ కార్టర్ అధ్యక్షుడిగా ఉన్న సమయంలో 1977 నుంచి 1981 వరకు మోండలే అమెరికా ఉపాధ్యక్షుడిగా పనిచేశారు. ఉపాధ్యక్షుడు కాకముందు 1960 నుంచి 64 వరకు వాల్టేర్ తన సొంత రాష్ట్రమైన మిన్నెసొటాకు అటార్నీ జనరల్‌గా సేవలు అందించారు. ఆ తర్వాత 1964 నుంచి 1976 వరకు యూఎస్ సెనేటర్‌గా పనిచేశారు. కార్టర్ పదవీకాలం ముగిసిన తర్వాత 1993 నుంచి 1996 మధ్య జపాన్‌కు అమెరికా రాయబారిగా పనిచేశారు.

కాగా, వాల్టర్ మృతికి అమెరికా అధ్యక్షుడు జో బైడెన్, ఉపాధ్యక్షురాలు కమలా హారిస్, మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా, మిన్నెసొటా సెనేటర్ అమీ క్లొబుచార్ తదితరులు నివాళులు అర్పించారు.

## ఆస్ట్రేలియాకి చెందిన సర్టిఫైడ్ ప్రాక్టీసింగ్ అకౌంటెంట్, భారత ఛార్టర్డ్ అకౌంట్స్ ఇన్స్టిట్యూట్ పరస్పర గుర్తింపు ఒప్పందాన్ని ఆమోదించిన క్యాబినెట్

హైదరాబాద్, ఏప్రిల్ 20:ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన క్యాబినెట్ సమావేశంలో ఆస్ట్రేలియాకి చెందిన సర్టిఫైడ్ ప్రాక్టీసింగ్ అకౌంటెంట్, భారత ఛార్టర్డ్ అకౌంట్స్ ఇన్స్టిట్యూట్ (ఐసిఏఐ) పరస్పర గుర్తింపు ఒప్పందాన్నిఆమోదించారు.

ఇన్స్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంట్స్ ఆఫ్ ఇండియా (ఐసిఏఐ) మరియు సిపిఎ ("సర్టిఫైడ్ ప్రాక్టీసింగ్ అకౌంటెంట్") మధ్య పరస్పర గుర్తింపు ఒప్పందం ప్రకారం, అకౌంటింగ్ పరిజ్ఞానం, వృత్తిపరమైన మరియు మేధో వికాసం, పురోగతి కోసం పరస్పర సహకార ఫ్రేమ్‌వర్క్‌ను ఏర్పాటు చేయడానికి ఆస్ట్రేలియా కలిసి పనిచేస్తుంది.

ఆయా సభ్యుల ప్రయోజనాలు, ఆస్ట్రేలియా, భారత్ లో అకౌంటింగ్ వృత్తి అభివృద్ధికి సానుకూలంగా దోహదం చేస్తాయి.రెండు అకౌంటింగ్ సంస్థల మధ్య పని సంబంధాలను పెంపొందుతాయి సభ్యులు, విద్యార్థులు, వారి సంస్థల ఉత్తమ ప్రయోజనంతో పరస్పర ప్రయోజనకరమైన సంబంధాన్ని అభివృద్ధి చేస్తాయి ఇరువైపులా నిపుణుల చైతన్యాన్ని పెంచడం, రెండు దేశాలలో చిన్న మరియు మధ్యతరహా వ్యాపారానికి కొత్త కోణాన్ని సృశిస్తాయి విశ్వ పర్యావరణ రంగంలో వృత్తి పరంగా ఎదుర్కొంటున్న కొత్త సవాళ్లను పరిష్కరించడంలో నాయకత్వ పాత్ర పోషించడానికి రెండు అకౌంటెన్సీ సంస్థలకు అవకాశం ఉంటుంది.

రెండు సంస్థల మధ్య ఒప్పందం వల్ల భారతీయ చార్టర్డ్ అకౌంటెంట్లకు ఎక్కువ ఉపాధి అవకాశాలు లభిస్తాయని మరియు భారతదేశానికి తిరిగి ఎక్కువ చెల్లింపులు జరుగుతాయని భావిస్తున్నారు.

**అమలు వ్యూహం, లక్ష్యాలు:**

రెండు సంస్థల పరీక్ష, శిక్షణ, ఆచరణాత్మక అనుభవ అవసరాలను పూర్తి చేయడం ద్వారా సభ్యత్వం సాధించిన ఇతర సంస్థల సభ్యుల అర్హతపై పరస్పర గుర్తింపును ఓఖీం అందిస్తుంది, వారి ప్రస్తుత అకౌంటెన్సీ అర్హత కోసం తగిన క్రెడిట్ పొందడం ద్వారా ఇతర సంస్థలో చేరడానికి వీలు కల్పిస్తుంది.

## కొవిడ్-19 స్థితి, కట్టడి ఇతర ప్రజారోగ్య అంశాలపై అన్ని కేంద్రపాలిత ప్రాంతాలతో సమీక్షించిన కేంద్ర హోం కార్యదర్శి

హైదరాబాద్, ఏప్రిల్ 20:కేంద్రపాలిత ప్రాంతాల్లో కోవిడ్-19 స్థితి, కోవిడ్ వ్యాప్తిని అరికట్టడానికి తీసుకోవలసిన చర్యలు, దీనికోసం అమలు చేయవలసిన కార్యాచరణపై కేంద్ర హోం శాఖ శ్రీ అజయ్ కుమార్ భల్లా కేంద్ర ఆరోగ్యశాఖ కార్యదర్శి శ్రీ రాజేష్ భూషణ్ తో కలసి ఈ రోజు కేంద్రపాలిత ప్రాంతాల ప్రధాన కార్యదర్శులతో ఉన్నత స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జరిగిన ఈ సమావేశంలో నీతి ఆయోగ్ సభ్యుడు ( ఆరోగ్య) డాక్టర్ వికె పాల్ , డిహెచ్‌ఆర్, డిజి ఐసిఎంఆర్ కార్యదర్శి డాక్టర్ బలరామ్ భార్గవ, అన్ని యుటిల పోలీసుల డిజిలు పాల్గొన్నారు.

దేశంలో కోవిడ్ కేసుల సంఖ్య దేశవ్యాపితంగా గణనీయంగా పెరుగుతున్న అంశాన్ని సమావేశంలో హోంశాఖ కార్యదర్శి ప్రస్తావించారు. 2021 జనవరి ఒకటవ తేదీ వరకు రోజుకి 20,000 వరకు వున్న కేసుల సంఖ్య 2021 ఏప్రిల్ 15 నాటికి పది రెట్లు పెరిగిందని ( 2,00,000 పైగా కేసులు) ఆయన అన్నారు. కడచిన 11 రోజుల్లోనే కేసుల సంఖ్య రెట్టింపు అయిందని అన్నారు. ఏప్రిల్ తొమ్మిదిన 1.31 లక్షల కొత్త కేసులు నమోదుకాగా ఏప్రిల్ 20వ తేదీన ఒక్కరోజే 2.73 లక్షల కేసులు నమోదయ్యాయని పేర్కొన్నారు.

కేంద్రపాలిత ప్రాంతాల్లో నమోదవుతున్న కోవిడ్ కేసులు, వారంలో నిర్వహించిన పరీక్షలు, వారంలో నమోదైన పాజిటివ్ కేసుల సంఖ్య, వారంలో గుర్తించిన కొత్త కేసులు, మరణాలు, ఆర్టీ పీసీఆర్, రాపిడ్ యాంటిజెన్ పరీక్షల వివరాలను సమావేశంలో చర్చించారు.

పాజిటివ్ కేసుల నివారణకు అమలు చేస్తున్న చర్యలను, పాజిటివ్ తేలిన వారి కోసం అమలు చేస్తున్న చర్యలను ఆయా కేంద్రపాలిత ప్రాంతాల అధికారులు వివరించారు. ఇతర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో వస్తున్న వారి వల్ల తమ ప్రాంతాల్లో కేసులు పెరుగుతున్నాయని లడఖ్,జమ్మూ కాశ్మీర్,లక్ష దీవుల అధికారులు వివరించారు. ఇటీవలి పండుగ సందర్భాలలో షాపింగ్ చేయడానికి పెద్ద సంఖ్యలో ప్రజలు ప్రధాన భూభాగానికి వెళ్లడం వల్ల 2021 ఏప్రిల్ 14 తరువాత ఇక్కడ కేసుల సంఖ్య ఒక్కసారిగా పెరిగింది. ఇప్పటికే అనేక కేంద్రపాలిత ప్రాంతాలు రాకపోకలపై ఆంక్షలు విధించడంతో పాటు రాత్రి కర్ఫ్యూని అమలు చేస్తున్నాయి. దీవులు కలిగి వున్న కేంద్రపాలిత ప్రాంతాల్లో దీవుల మధ్య జరిగే రాకపోకలపై ఆంక్షలను విధించాయి, టీకాల కార్యక్రమాన్ని మరింత ఎక్కువగా అమలు చేయడానికి ఇంటింటికి వెళ్లి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని చండీఘర్ అధికారులు తెలిపారు. 90% మంది రోగులు హోం ఐసొలేషన్ లో వుంటున్నారని వీరిని మొబైల్ బృందాలు పర్యవేక్షిస్తున్నాయని అధికారులు వివరించారు. తమ వద్ద పడకల కొరత ఉందని, వీటి సంఖ్యను పెంచడానికి కేంద్ర ప్రభుత్వ సౌకర్యాలను, ఇటీవల డీఆర్డీఓ కొత్తగా ప్రారంభించిన ఆస్పత్రిని వినియోగిస్తూ చర్యలను తీసుకుంటున్నామని ఢిల్లీ అధికారులు తెలిపారు.

Printed, Published and owned by VEENADAS,at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana.Published at SRT-74,Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas.
**RNI No.52865/93.** E-mail :netinijam93@gmail.com